## బివైడీ కార్ల సంస్థ రావడం ఆనందదాయకం

హైదరాబాద్,రాష్ట్రాని బీవైడీ కార్ల సంస్థ పెట్టుబడి రావడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంతోషం వ్యక్తంచేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ విధానాల వల్లే రాష్ట్రానికి బీవైడీ సంస్థ వచ్చిందన్నారు. 2023లోనే 10 బిలియన్ డాలర్ల పెట్టు-బడికి బీవైడీ, ఒలెక్ట్రా అంగీకారం కుదుర్చు కున్నాయని చెప్పారు. బీవైడీ కంపెనీ రాష్ట్రానికి రావడం ఫార్ములా-ఈ రేసు ప్రత్యక్షఫలితమని వెల్లడించారు. బీవైడీ రాకకు ఏండ్ల తరబడి కష్టపడిన అందరికి ఎక్స్ వేదికగా అభినందనలు తెలిపారు.'బీఆర్ఎస్ ప్రభుత్వ కృషితోనే తెలంగాణకు బీవైడీ సంస్థ వచ్చింది. నాడు బీఆర్ఎస్ చేసిన కృషి.. నేడు ఫలితించింది. దిగ్గజ కంపెనీ భారీ పెట్టు-బడితో యువతకు ఉపాధి అవకాశాలు వస్తాయి. ఫార్ములా-ఈ రేసు నిర్వహణతో ప్రపంచం దృష్టిని తెలంగాణ ఆకర్షించింది. ప్రభుత్వాలు మంచి విధానాలు ప్రవేశపెడితే నీఛమైన రాజకీయాలను అధిగమించి మంచి ఫలితాలు వస్తాయి. తాము ప్రవేశపెట్టిన తెలంగాణ మొబిలిటీ- వ్యాలీ, ఈవీ విధానం వల్లే ఈ రోజు బీవైడీ తెలంగాణకు వచ్చింది. తెలంగాణ మొబిలిటీ- వ్యాలీ, ఈవీ పాలసీ భాగంగానే ఫార్ములా-ఈ రేస్‌ను నిర్వహించాం.


# అగ్రనేత

TELTEL/2015/66279

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :32 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: ఆదివారం 30-03-2025 | పేజీలు:4 వెల: 2.00


## 15 టన్నుల సహాయ సామగ్రిని పంపిన భారత్



మయన్మార్ , థాయ్‌లాండ్ దేశాలను శుక్రవారం రెండు అత్యంత శక్తిమంతమైన భూకంపాలు కుదిపేసిన విషయం తెలిసిందే. నిమిషాల వ్యవధిలోనే చోటు చేసుకున్న భూ ప్రకంపనలతో రెండు దేశాలు వణికిపోయాయి. రోడ్లు, వంతెనలు, ఎయిర్‌పోర్ట్‌లు దెబ్బతిన్నాయి. అనేక భవనాలు నేలమట్టమయ్యాయి. ఈ విపత్తులో భారీగా ప్రాణ, ఆస్తి నష్టం సంభవించింది. ఈ నేపథ్యంలో ప్రకృతి ప్రకోపానికి తీవ్రంగా నష్టపోయిన మయన్మార్, థాయ్‌లాండ్‌ను ఆదుకునేందుకు ప్రపంచ దేశాలు ముందుకొచ్చాయి. %ఈ విపత్తులో పూర్తిగా దెబ్బతిన్న మయన్మార్‌కు భారత్ దాదాపు 15 టన్నుల సహాయ సామగ్రిని సైనిక రవాణా విమానంలో పంపింది. 'ఆపరేషన్ బ్రహ్మ' కింద భారత వైమానిక దళానికి చెందిన %జ130జీ% విమానం సహాయ సామగ్రితో హిండన్ వైమానిక దళ కేంద్రం నుంచి మయన్మార్‌కు బయల్దేరినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఇందులో టెంట్లు, దుప్పట్లు, స్లీపింగ్ బ్యాగులు, జనరేటర్లు, ఆహార ప్యాకెట్లు, నీటి శుద్ధి పరికరాలు, సౌర దీపాలు, అవసరమైన మందులు పంపుతున్నట్లు సదరు వర్గాలు పేర్కొన్నాయి. భారత్‌తోపాటు అమెరికా, ఇండోనేషియా, చైనా కూడా అవసరమైన సాయం అందిస్తామని ప్రకటించాయి.

1,000 దాటిన మరణాల సంఖ్య

మరోవైపు ఈ విపత్తులో మరణించిన వారి సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. తాజా సమాచారం ప్రకారం.. రెండు దేశాల్లో మరణాల సంఖ్య వెయ్యి దాటింది. మయన్మార్‌లో కనీసం 1002 మంది మరణించినట్లు మయన్మార్ మిలిటరీ (%వీఖుఅఖుతీ ఎఅశ్రీఘ్మితీఎ%) అధికారులు ఈ ఉదయం ఓ ప్రకటనలో వెల్లడించారు. మరో, 2370 మంది గాయపడినట్లు పేర్కొన్నారు. శిథిలాల కింద వందల మంది చిక్కుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ప్రభావిత ప్రాంతాల్లో సహాయ చర్యలు కొనసాగుతున్నట్లు వెల్లడించారు. దీంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా.. బ్యాంకాక్ (%ఃఘఅన్త్రనిశీని%)లో 10 మంది మరణించగా.. ఓ భారీ భవంతి కూలిన ఘటనలో దాదాపు 100 మంది నిర్మాణ కార్మికులు గల్లంతయ్యారు. అయితే రెండు దేశాల్లో మరణాల సంఖ్య 10 వేలు దాటే అవకాశం ఉన్నదని అమెరికా ఏజెన్సీ అంచనావేసింది.

## నేపాల్‌లో హింస.. 100 మంది అరెస్ట్

హిమాలయ దేశం నేపాల్‌లో తిరిగి రాచరికాన్ని ప్రవేశపెట్టాలనే డిమాండ్ అంతకంతకూ పెరుగుతోంది. దీంతో అక్కడ గత కొంతకాలంగా ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి. దేశంలోని ప్రజలు రాచరిక పాలన కోరుతూ మాజీ రాజు జ్ఞానేంద్ర షా మద్దతుదారులు రోడ్లపైకి వచ్చి పెద్ద ఎత్తున నిరసన చేపడుతున్నారు. ఈ సందర్భంగా తాజాగా అక్కడ హింస చోటు చేసుకుంది. నేపాల్ రాజధాని ఖాట్మండూ లోని కొన్ని ప్రాంతాల్లో రాచరిక అనుకూల నిరసనకారులు రెచ్చిపోయారు. ఒక రాజకీయ పార్టీ కార్యాలయంపై దాడి చేశారు. ఓ టెలివిజన్ ఆఫీసును, పత్రికా కార్యాలయాన్ని ధ్వంసం చేశారు. రాళ్లు రువ్వడంతోపాటు, వాహనాలకు నిప్పంటించారు, దుకాణాలను దోచుకున్నారు. దీంతో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. దీంతో సైన్యం రంగప్రవేశం చేసి నిరసనకారులను అడ్డుకుంది. ఈ ఘర్షణల్లో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. సుమారు 112 మంది గాయపడ్డారు. రంగంలోకి దిగిన పోలీసులు సుమారు 100 మంది నిరసనకారులను అరెస్ట్ చేశారు.కాగా, నేపాల్‌లో రాచరికం 2008లో



అంతమైంది. ఫిబ్రవరి 19న ప్రజాస్వామ్య దినోత్సవం సందర్భంగా మాజీరాజు జ్ఞానేంద్ర తనకు మద్దతు ఇవ్వాల్సిందిగా ప్రజలకు పిలుపునిస్తూ వీడియో జారీ చేసినప్పటి నుంచి రాచరిక అనుకూల ఉద్యమం రాజుకుంది. దీని తరువాత దేశంలో ఆందోళనలు చెలరేగాయి.

## మయన్మార్‌లో 1000 దాటిన మరణాల సంఖ్య..



మయన్మార్ థాయ్‌లాండ్ దేశాలను శుక్రవారం రెండు అత్యంత శక్తిమంతమైన భూకంపాలు కుదిపేసిన విషయం తెలిసిందే. నిమిషాల వ్యవధిలోనే చోటు చేసుకున్న భూ ప్రకంపనలతో మయన్మార్, థాయ్ దేశాలు వణికిపోయాయి. రోడ్లు, వంతెనలు, ఎయిర్‌పోర్ట్‌లు దెబ్బతిన్నాయి. అనేక భవనాలు నేలమట్టమయ్యాయి. ఈ విపత్తులో భారీగా ప్రాణ, ఆస్తి నష్టం సంభవించింది. ముఖ్యంగా మయన్మార్ ఈ విపత్తుకు తీవ్రంగా ప్రభావితమైంది. మృతుల సంఖ్య కూడా అక్కడ భారీగానే ఉంది. తాజా సమాచారం ప్రకారం రెండు దేశాల్లో భూకంపం కారణంగా ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య 1,000 దాటింది.

ప్రకృతి ప్రకోపానికి మయన్మార్‌లో కనీసం 1002 మంది మరణించినట్లు మయన్మార్ మిలిటరీ అధికారులు ఈ ఉదయం ఓ ప్రకటనలో వెల్లడించారు. మరో, 2376 మంది గాయపడినట్లు పేర్కొన్నారు. శిథిలాల కింద వందల మంది చిక్కుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ప్రభావిత ప్రాంతాల్లో సహాయ చర్యలు కొనసాగుతున్నట్లు వెల్లడించారు. దీంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా.. బ్యాంకాక్ లో 10 మంది మరణించగా.. ఓ భారీ భవంతి కూలిన ఘటనలో దాదాపు 100 మంది నిర్మాణ కార్మికులు గల్లంతయ్యారు. అయితే రెండు దేశాల్లో మరణాల సంఖ్య 10 వేలు దాటే అవకాశం ఉన్నదని అమెరికా ఏజెన్సీ అంచనావేసింది.

## సుక్మా జిల్లాలో భారీ ఎన్‌కౌంటర్..



కొత్తగూడెం ప్రగతి మైదాన్, మార్చి 29: ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో మరోసారి తుపాకుల మోత మోగింది . పచ్చటి ప్రకృతి వనంలో నెత్తుటేర్లు పారాయి. భద్రతా దళాలు, మావోయిస్టులకు మధ్య శనివారం ఉదయం జరిగిన భీకర పోరులో 20 మంది మావోయిస్టులు మృతి చెందారు. సుక్మా జిల్లా గోగుండ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు సీఆర్పీఎఫ్, డీఆర్జీ భద్రతా దళాలు సంయుక్తంగా సెర్చింగ్ ఆపరేషన్ నిర్వహించాయి. ఈ క్రమంలో వారికి తారాసపడిన మావోయిస్టులు.. జవాన్లపై కాల్పులు జరిపారు. అప్పటికే ఆ ప్రాంతంలో భారీగా మోహరించిన భద్రతా దళాలు నలుదిక్కులా చుట్టూ ముట్టి ఎదురుకాల్పులను ప్రారంభించాయి. ఇరు వర్గాల మధ్య విడతలవారీగా ఉదయం నుంచి కాల్పులు కొనసాగుతూనే ఉన్నాయి. మృతుల్లో డీవీసీఎం జగదీశ్ కూడా ఉన్నట్లు సమాచారం. ఇప్పటి వరకు సుమారు 20 మృతదేహాలను స్వాదీనం చేసుకున్నట్లు ప్రాథమికంగా తెలుస్తున్నది. భద్రతా బలగాల కాల్పుల్లో మరికొందరు మావోయిస్టులు తీవ్రంగా గాయపడినట్లు పోలీసు వర్గాలు పేర్కొన్నాయి. %ఆపరేషన్ 'కగార్'లో భాగంగా దండకారణ్యంలో మావోయిస్టుల వేట కొనసాగుతున్నది. ఇటీవల ఛత్తీస్‌గఢ్ జిల్లాల్లో జరిగిన పలు ఎన్‌కౌంటర్లను ఉద్దేశించి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా.. ఎక్స్ వేదికగా ప్రకటన చేశారు. 2026 మార్చి 31 నాటికి మావోయిజాన్ని పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యంగా ఆపరేషన్ కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాల దృష్ట్యా నక్సలిజాన్ని తుద ముట్టించడమే లక్ష్యంగా కేంద్రం వ్యూహాలు రచించినట్టు అవగతమవుతుంది. బస్తర్ రేంజ్ పరిధిలో జరిగిన ఎదురు కాల్పుల్లో ఇప్పటివరకు సుమారు 100 కి పైగానే మావోయిస్టులు మృతి చెందారు. ప్రస్తుతం సుకుమా జిల్లాలో కొనసాగుతున్న ఈ ఆపరేషన్లో మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉంది. ఆ ప్రాంతంలో ఇంకా ఎదురు కాల్పులు కొనసాగుతున్నాయి. ఈ ఘటనపై ఉన్నతాధికారులు అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది.

## ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో కొనసాగుతున్న సహాయక చర్యలు

నాగర్‌కర్నూల్, మార్చి 29: నాగర్ కర్నూల్ జిల్లాలోని దోమల పెంట ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో సహాయక చర్యలు 36వ రోజుకు చేరుకున్నాయి. సొరంగంలో చిక్కుకున్న వారిని వెలికితీసేందుకు రెస్క్యూ బృందాలు నిర్విరామంగా కృషిచేస్తున్నాయి. ప్రమాదం జరిగి 36 రోజులు గడుస్తున్నా.. ఇప్పటికీ ఇద్దరు ఇంజనీర్ల మృతదేహాలు మాత్రమే లభించాయి. మిగిలిన ఆరుగురి కోసం తీవ్రంగా శ్రమిస్తున్నారు. రోజు మాదిరిగానే శనివారం ఉదయం సైతం ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్, సింగరేణి, ఆర్మీ, కేరళ పోలీస్ క్యాడవార్ డాగ్స్ వంటి రిస్క్యూ టీంలు సహాయ చర్యలు చేపట్టేందుకు సొరంగంలోకి వెళ్లాయి. ఇంత శ్రమిస్తున్న శ్రమకు తగిన ఫలితం దక్కడం లేదన్న ఆవేదనతో అధికారులు, రెస్క్యూ బృందాలు, కార్మికులు ఉన్నారు. సొరంగంలోకి ఉబికి వస్తున్న నీటి ఊటను నిలువరిస్తే తప్ప సహాయక చర్యలు ముందుకు సాగవనేది రెస్క్యూ బృందాలు చర్చించుకుంటున్నట్టు తెలుస్తుంది. ప్రత్యేక అధికారి శివశంకర్ ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్ష నిర్వహిస్తూ సలహాలు సూచనలు చేస్తూ అత్యాధునిక పరికరాలతో సహాయక చర్యలు చేపడుతున్నప్పటికీ టన్నెల్లో చిక్కుకున్న కార్మికులను బయటకు తేలేకపోతున్నారు. జీఎస్ఐ అధికారుల సూచనలకు అనుగుణంగా ప్రమాద ప్రదేశం నుంచి 30 మీటర్ల వరకు బారికేడింగ్ చేశారు. టెలిటెల్, బాక్స్ క్రీప్ స్ట్రక్చర్ లాంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా నిరంతరం పర్యవేక్షణ జరుపుతున్నా మృతదేహాలు బయటకు తీయలేకపోతున్నామనే నిరాశ రెస్క్యూ



బృందాలో నెలకొంటుంది. ప్రమాద ప్రదేశం సమీపంలో మట్టి కింద ఉన్న లోకో ట్రైన్ క్యాబిన్లను తొలగించి లోకో ఇంజిన్‌ను బయటకు తీసేందుకు ప్రయత్నిస్తున్నారు. శనివారం ఆ పనులు పూర్తయే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే సొరంగంలో చిక్కుకున్న లోకో ట్రైన్ విడిభాగాలను కటింగ్ చేసి బయటకు తరలిస్తున్నారు. పూర్తిస్థాయిలో ట్రైన్ ను మొత్తాన్ని బయటకు తీస్తే రెస్క్యూ బృందాలకు మృతదేహాలను తీసేందుకు మార్గం సులువుగా ఉంటుందని తెలుస్తోంది. ఈరోజు మొత్తం పూర్తిస్థాయిలో అవే పనులు జరుగుతున్నట్లు సమాచారం. కాగా, పలానా చోట డెడ్ బాడీ ఉంది అని తెలిసినా బయటకు తీయలేకపోతున్నామనే నిరాశతో రెస్క్యూ బృందాలు ఉన్నాయి.

## మన ప్రధానిపై ట్రంప్ ప్రశంసలు

భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రశంసల వర్షం కురిపించారు. మోదీ చాలా తెలివైన వ్యక్తి అని గ్రేట్ ప్రైమ్ మినిస్టర్ అంటూ పొగడ్తలతో ముంచెత్తారు. మోదీతో తనకు మంచి స్నేహబంధం ఉందని తెలిపారు. రెండు దేశాల మధ్య కొనసాగుతున్న వాణిజ్య చర్చలు సానుకూల ఫలితాలను ఇస్తాయని ట్రంప్ విశ్వాసం వ్యక్తం చేశారు. వైట్‌హౌస్‌లో మీడియాతో మాట్లాడుతూ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు.'ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాకు మంచి స్నేహితుడు. ఆయన చాలా తెలివైన వ్యక్తి. గ్రేట్ ప్రైమ్ మినిస్టర్. మోదీ ఇటీవలే యూఎస్ పర్యటకు వచ్చారు. మా మధ్య మంచి చర్చలు జరిగాయి. అవి ఇరుదేశాలకు ఉపయోగకరమైనవిగా భావిస్తున్నా. కానీ, ఆ దేశంతో నాకు ఉన్న ఏకైక సమస్య ఒకటే. అది సుంకాలు. ప్రపంచంలోనే అత్యధిక టారిఫ్‌లు విధించే దేశాల్లో భారత్ ఒకటి. అయితే, సుంకాలను వారు గణనీయంగా తగ్గిస్తారని నేను నమ్ముతున్నా. ఏప్రిల్ 2న యూఎస్ దిగుమతులపై ఎంత సుంకాలు విధిస్తే.. నేను కూడా వారి నుంచి అంతే వసూలు చేస్తా' అని ట్రంప్ పేర్కొన్నారు.కాగా, భారత్ వాణిజ్య విధానాలను ట్రంప్ పదే పదే విమర్శిస్తూ వస్తున్న విషయం తెలిసిందే. సుంకాల విషయంలో



భారత్‌పై గతంలోనూ ట్రంప్ ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. పది రోజుల క్రితం బ్రెయిట్‌బార్ట్ న్యూస్‌తో ట్రంప్ మాట్లాడుతూ.. 'నాకు భారత్‌తో మంచి సంబంధం ఉంది. కానీ ఏకైక సమస్య ఏంటంటే.. ప్రపంచంలోనే అత్యధిక సుంకాలు విధించే దేశాల్లో భారత్ ఒకటి. భారత్ టారిఫ్‌లను గణనీయంగా తగ్గించే అవకాశం ఉన్నట్లు నేను నమ్ముతున్నాను. కానీ, ఏప్రిల్ 2 నుంచి వారెంత విధిస్తే.. మేమూ అంతే వసూలు చేస్తాం' అని ట్రంప్ అన్నారు.

## రైలు టికెట్లు కౌంటర్‌లో కొన్నా ఆన్‌లైన్‌లో క్యాన్సిల్ చేసుకోవచ్చు : అశ్వినీ వైష్ణవ్

ప్రయాణికులకు ఉపశమనం కలిగిస్తూ భారతీయ రైల్వే సరికొత్త సదుపాయాన్ని ప్రవేశపెట్టింది. ఇకపై ప్రయాణికులు టికెట్లను రైల్వే కౌంటర్‌లో కొనుగోలు చేసినా ఆన్‌లైన్‌లో క్యాన్సిల్ చేసుకునే వెసులుబాటు కల్పించింది. ఈ విషయాన్ని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. 'కౌంటర్ ద్వారా వెయిటింగ్ లిస్ట్ టికెట్లు కొన్న ప్రయాణికులు టికెట్ క్యాన్సిల్ చేయించుకోవడానికి రైలు బయలుదేరక ముందే స్టేషన్‌ను సందర్శించాల్సి ఉంటుందా?'అని బీజేపీ ఎంపీ మేధా విశ్రం కుల్‌కర్ణి అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి సమాధానమిచ్చారు. ప్రయాణికులు ఇకపై తమ టికెట్లను రద్దు చేసుకోవడానికి స్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. ప్రయాణికులు రైలు టికెట్లను కౌంటర్‌లో కొన్నా దానిని ఆన్‌లైన్‌లో క్యాన్సిల్ చేసుకోవచ్చని తెలిపారు. ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్‌లో లేదా 139కి ఫోన్ చేసి టికెట్ రద్దు చేసుకోవచ్చని స్పష్టం చేశారు. అయితే క్యాన్సిల్ డబ్బులు



వసూలు చేసుకోడానికి రిజర్వేషన్ సెంటర్‌ను సందర్శించాల్సి ఉంటుందని తెలిపారు.

## సీఎంఆర్ఎఫ్ నిరుపేదలకు వరం : గుత్తా సుఖేందర్‌రెడ్డి

నల్లగొండ , మార్చి 29 : సీఎం సహాయ నిధి నిరుపేదలకు వరం అని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. నల్లగొండలోని తన క్యాంప్ కార్యాలయంలో వివిధ అనారోగ్య కారణాల రీత్యా వివిధ హాస్పిటల్స్‌లో చికిత్స పొందిన 41 మందికి శనివారం ఆయన సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. మొత్తం రూ.13.66 లక్షల విలువ చేసే చెక్కులను పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి సంవత్సరానికి దాదాపు రూ.1000 కోట్లకు పైన రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తూ నిరుపేదలకు ఆసరాగా నిలుస్తుందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.



పార్టీలకు అతీతంగా సీఎంఆర్ఎఫ్ ఇవ్వడం హర్షించదగ్గ విషయం అన్నారు.

## బైక్‌పై అతివేగంతో హోర్డింగ్‌ను ఢీకొట్టిన బీటెక్ విద్యార్థి..

కుత్బుల్లాపూర్, మార్చి 29 : బైక్‌పై అతివేగంతో వెళ్లిన విద్యార్థి హోర్డింగ్‌ను ఢీకొట్టి తీవ్ర గాయాలు కాగా.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తుర్కయాంజల్ బీఎన్ రెడ్డి నగర్ కు చెందిన రావత్ యశ్వంత్(25) గుండ్ల పోచంపల్లిలో మల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ రెండవ సంవత్సరం చదువుతున్నాడు. కళాశాల సమీపంలో ఉన్న ప్రైవేట్ ఆసుపత్రిలో ఉంటూ విద్యను అభ్యసిస్తున్నాడు. ఈనెల 28న మధ్యాహ్నం సమయంలో తన స్నేహితుడు అభినవ్ సింగ్‌తో కలిసి బైక్‌పై బయటకు వెళ్లాడు. ఈ క్రమంలో తిరిగి మధ్యాహ్నం సమయంలో హాస్టల్‌కు వస్తున్న మార్గ మధ్యలోని దూలపల్లి పెట్రోల్ బంక్ మూల మలుపు వద్ద అతివేగంతో వెళ్లి రోడ్డు పక్కన ఉన్న హోర్డింగ్‌ను ఢీకొట్టాడు.

దీంతో యశ్వంత్‌కు తీవ్ర గాయాలు కాగా స్థానికులు ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. యశ్వంత్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా రాత్రి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## ఇంట్లో పెట్టి తాళం వేసి వెళ్లిన భర్త.. ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న భార్య

హైదరాబాద్‌లో తీవ్ర విషాదం నెలకొంది. అత్తాపూర్‌లో మెహందీ ఆర్టిస్ట్ పింకీ శర్మ ఆత్మహత్య చేసుకుంది. తన ఇంట్లో చున్నీతో ఫ్యాన్‌కు ఉరేసుకుంది. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు అత్తాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. అమిష్ లోయా అనే వ్యక్తితో ఏడాది క్రితం పింకీ శర్మ వివాహం జరిగింది. పెళ్లయిన కొద్దిరోజుల పాటు వీరి కాపురం సజావుగా సాగినప్పటికీ..తర్వాత ఇద్దరి మధ్య కలహాలు మొదలయ్యాయి. అప్పట్నుంచి బయటకు వెళ్లేప్పుడు పింకీ శర్మను ఇంట్లో పెట్టి తాళం వేసేవాడు. ఈ క్రమంలోనే శుక్రవారం రాత్రి కూడా పింకీ శర్మ, అమిష్ మధ్య గొడవ జరిగింది. దీంతో పింకీ శర్మను ఇంట్లో పెట్టి బయటకు వెళ్లిపోయాడు. కాసేపటికి ఇంటికి తిరిగొచ్చేసరికి పింకీ శర్మ చున్నీతో ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించింది.ఫ్యాన్‌కు వేలాడుతున్న పింకీ శర్మను చూడగానే కంగారుపడిపోయిన అమిష్.. వెంటనే పక్కింటి వాళ్లను పిలిచాడు. పక్కింటి వాళ్ల సాయంతో పింకీని కిందకు దించి ఆస్పత్రికి తరలించాడు. కానీ ఫలితం లేకపోయింది. అప్పటికే పింకీ శర్మ మరణించిందని వైద్యులు నిర్ధారించారు. స్థానికుల సమాచారం మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కుటుంబ కలహాల కారణంగానే పింకీ శర్మ ఆత్మహత్య చేసుకుందని పోలీసులు అనుమానిస్తున్నారు. పింకీ ఆత్మహత్యకు తన భర్త వేధింపులే కారణమా?

## సంపాదకీయం

ఆదివారం 30-03-2025

# నీతిమాలిన రాజకీయాలు పనిచేయవు !

ఎన్నికలంటేనే తిమ్మిని బమ్మిని చేయడం..ఎత్తులు పైఎత్తులు వేయడం....ఎదుటి వారిని బురిడీ కొట్టించడం.. అబద్దాలు చెప్పడం..ఆచరణ సాధ్యం కాని హామీలు గుప్పించడం.. ఓటర్లను ప్రలోభ పెట్టడం...ఇవన్నీ సర్వసాధారణం. మనమెంత నిజాయితీగా ఉన్నా..ఎదుటివారు అనుసరించే ఎత్తులను గమనించి ముందుకు సాగాలి. మనం నిజాయితీగా ఉంటూనే చెడును దునుమాడే ధైర్యం కూడా సొంత చేసుకోవాలి. రాజకీయంగా మనమెంత బలంగా ఉన్నా.. ఎదుటి పక్షం మనపై నిరంతరం బురదజల్లే ప్రయత్నం చేస్తుంది. బట్టకాల్చి మీద వేస్తుంటారు... ఇలాంటి అనుభవాలు మనకు లేకున్నా భరించాల్సిందే. అయితే వీటిని దీటుగా ఎదుర్కోవాలి. గట్టిగా తిప్పికొట్టాలి. ముల్లును ముల్లుతోనే తీయాలన్న సామెతను ఆధారం చేసుకుని ముందుకు సాగాలి. ప్రజల కోసం రాజకీయంలోకి దిగిన పార్టీలు కావచ్చు..నేతలు కావచ్చు...అందుకు దీటుగా ప్రచారాస్త్రాలను సంధించా ల్సిందే.. అందుకు వారి వాదనల ను బలంగా ప్రజలకు చేరవేయాల్సిందే. కొత్తగా నినాదాలు సిద్దం చేసుకోవాల్సిందే.. అయితే ఇదే క్రమంలో మనం చేసిన మంచిని ఒకటికి పదిసార్లు పదేపదే ప్రజల చెంతకు చేర్చాలి. అభివృద్ధి పనులను ప్రజల్లో చర్చ జరిగేలా చేయాలి. గత ఐదేళ్లలో ఏ పనికి ఎంత మొత్తం కేటాయించామో చర్చ జరిగేలా చేయాలి. ఎన్ని మంచిపనులు చేశామో లెక్కలతో సహా చెప్పగల గాలి. అలాగే అవినీతికి ఎంతగా దూరం ఉన్నామో కూడా ముఖ్యం. అలాగే అభివృద్ధి కళ్లకు కనపడుతుందా అన్నది కూడా ముఖ్యమే. అందుకే రాజకీయాల్లో విలువలకు తావులేకుండా పోతోంది. రాజకీయాల్లో విలువలు పతనం అయ్యాయి. అధికారమే పరమావధిగా అన్ని పార్టీలు భ్రమిస్తున్నాయి. తామే మంచి చేశామని, చేస్తామని చెప్పకుంటూ పబ్బం గడుపుతున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అధికార పార్టీలోకి పలుఉవరు చేరికలు ఇప్పటికే మొదలయ్యాయి. ఇంకా కొనసాగుతాయి. బిఆర్ఎస్ నుంచి అధికార కాంగ్రెస్‌లో చేరిన పదిమంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు కోసం బిఆర్ఎస్ అలుపెరుగని పోరాటం చేస్తోంది. ఉప ఎన్నికలు వస్తాయని కూడా హెచ్చరికలు చేస్తోంది. ఈ విషయంలో గతంలో ఉన్న చట్టాలే ఇప్పుడూ ఉన్నాయని, ఆనాడు లేని ఎన్నికలు ఇప్పుడెలా వస్తాయని సిఎం రేంవత్ రెడ్డి పలు సందర్భాల్లో వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీ వేదికగా కూడా ఇవే వ్యాఖ్యలు చేశారు. అయితే కోర్టు తీర్పులకు, లేదా హెచ్చరికలకు స్పీకర్ లోబడి ఉండాలా అన్న చర్చ సాగుతోంది. స్పీకర్ కూడా చట్టపరమైన అధికారంలో ఉన్నవారే. అసెంబ్లీకి సంబంధించి ఆయన నిర్ణయాలకే ప్రాధాన్యం ఉన్నాయి. మని సుప్రీం తీర్పు ఎలా ఉన్నా, అధికారపక్షం మాత్రం ధీమాగా ఉంది. ఇకపోతే ఎపిలో వైకాపా నుంచి అనేకమంది జారుకున్నారు. అధికార టిడిపిలో చేరారు. అక్కడో వెసలుబాటు ఉంది. టిడిపి, జనసేన, బిజెపి పార్టీలు మూడూ కూటమిగా అధికారంలో ఉండడంతో మూడు పార్టీల్లోనూ చేరుతున్నారు. తమకు అనుకూలంగా ఉన్న పార్టీలో చేరిపోతున్నారు. దీంతో ఏ పార్టీకి వచ్చిన నష్టం లేదు. ఎందుకంటే రాజకీయాలు ఎప్పుడూ అధికారం చుట్టే తిరుగుతాయి. అధికారం ఉన్న పార్టీకే ఆకర్శణ ఎక్కువ. సిద్ధాంత నిబద్ధతలకు ఇక్కడ తావు లేదు. అందుకే ఏ పార్టీలో గెలిచామన్న దానికి నేతలు ప్రాధాన్యం ఇవ్వడం లేదు. అధికారంలో ఉన్న పార్టీలో ఉన్నామా లేమా అని లెక్కలు వేసుకుంటున్నారు. రాజకీయాల్లో నేర్చుకున్న సిద్ధాంతం ఇది. ఈ సిద్ధాంతాన్నే ఇప్పుడు కాంగ్రెస్ అనుసరిస్తోంది. ఎపిలో కూటమి నేతలు అనుసరిస్తున్నా గతంలో కాంగ్రెస్, సిపిఐ, టిడిపి ఎమ్మెల్యేలను నిస్సిగ్గుగా టిఆర్ఎస్‌లో చేర్చుకుని తెలంగాణ పునరేకీకరణ అంటూ ప్రచారం చేశారు. ఈ సూత్రాలే ఇప్పుడు పునరావృతం అవుతుంటే బిఆర్ఎస్ భుజాలు తుడుముకుంటోంది. సిగ్గు సిగ్గు అంటూ శివాలు వేస్తోంది. కెటిఆర్ లాంటి వారు రాజకీయ బేహారులు అంటూ విమర్శలు చేస్తున్నారు.కానీ ప్రచారంలోనే అభివృద్దిని చూపి అవినీతికి,అక్రమాలకు, అధికార దుర్విని యోగానికి పాల్పడ్డ విషయాలను బిఆర్ఎస్ నేతలు కనపడకుండా చేశామని అనుకున్నారు. అయితే ప్రజలకు ఇదంతా తెలిసిపోయింది. అందుకే బిఆర్ఎస్, వైకాపా నేతల అవినీతిని, అహంకారాన్ని భరించలేక పోయారు. అధికార మార్పుతో రెండు రాష్ట్రాల్లో కొత్త ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. దీనిని జీరి÷–ణించుకుని మంచి సంప్రదాయం పాటించి మళ్లీ ప్రజల్లో పేరు తెచ్చుకుని సాగాల్సి ఉంటుంది. సామాజిక మాధ్యమాలు బలంగా ఉన్న ఈకాలంలో ప్రతి చిన్న అవినీతి, అక్రమం క్షణాల్లో ప్రజలకు చేరిపోతోంది. ప్రజల అభిప్రాయాలను తీసుకుని చేసిన మంచిని ప్రజల ముందుంచడంతో పాటు అవినీతి మట్టి అంటుకోకుండా పాలన చేయాల్సి నేతలు , అధికారం దక్కగానే అవినీతి బురదలో కూరుకుపోతున్నారు. అక్రమాలకు పాల్పడ్డారు. అవినీతిని సొంతం చేసుకున్నారు. అంతకు మించి ప్రజలతో మనకేమి సంబంధం అన్న రీతిలో వారిని దూరం పెట్టారు. ఒక సిఎం ప్రజలను కలవాల్సిన పనిలేదని అహంకారం ప్రద్శించారు. అందుకే ప్రజలు తీర్పునిచ్చారు. వారివెంట ఉన్న బలగం అంతా మెల్లగా జారుకోవడం అన్నది కూడా సహజ పరిణామం. ఇది ఏ రాజకీయ పార్టీకైనా వర్తిస్తుంది. సచ్ఛీలతతో మళ్లీ ప్రజల ముందుకు వెళ్లాలి. తమ సిద్ధాంతాలను మార్చుకోవాలి. ప్రజల కోసం పోరాటాలు చేయాలి. కానీ జగన్ అదేపనిగా విమర్శలకే పరిమితం అయ్యారు. ఐదేళ్లలో పోలవరం ముందుకు కదదలేదు. అమరావతిని పక్కన పెట్టాడు. అనేకరకమైన లిక్కర్ బ్రాండ్లతో అవినీతికి తెరలేపారు. ఇవన్నీ ప్రజల ముందున్న సజీవ సాక్ష్యాలు. అందుకే అధికారం పోవడంతో రాజరికాన్ని భరించడం,తట్టుకోవడం సాధ్యం కాదు కనక ఒక్కొక్కరే జారుకుంటున్నారు. పోరాటాలతో మళ్లీ రాటుదేలితేనే ప్రజలు వెంటనడుస్తారు.

# వ్యంగ్యాన్ని సహించరా..!



ముంబై:స్టాండప్ కమేడియన్ కునాల్ కమ్రా లక్ష్యంగా మహారాష్ట్రలోని పాలక పక్షం, దాని అనుచర గణాలు చెలరేగిపోతున్న తీరు దారుణం. మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేపై కునాల్ కమ్రా చేసిన వ్యంగ్య వ్యాఖ్యను ఏ మాత్రం సహించలేని అధికారంలో ఉన్న ఎన్‌డిఎ కూటమి హింసాత్మక చర్యలకు దిగింది. ఆయన ప్రదర్శన చేసిన హేబిటేట్ స్టూడియోపై పాలక కూటమి గూండాలు ఒకవైపు దాడి చేయగా, మరోవైపు మున్సిపల్ అధికారులు స్టూడియోలోని పలు భాగాలను కూల్చివేశారు. కమ్రాను అడ్డగించడం, బెదిరించడంతో పాటు ఆయనపై అనేక కేసులను పోలీసులు నమోదు చేశారు. విమర్శను సహించలేని కూటమి ప్రభుత్వం ఒక వ్యక్తిని లక్ష్యంగా చేసుకుని చేపట్టిన ఈ బరితెగింపు చర్యలు నిస్సందేహంగా కక్ష సాధింపు మాత్రమే గాక, భావ ప్రకటనా స్వేచ్ఛను కాలరాయడమే! ప్రజాస్వామ్యంలో విమర్శకు ఎంతో ప్రాధాన్యత ఉందంటూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తనదైన శైలిలో సూక్తిముక్తావళి పఠించిన కొద్ది రోజుల్లోనే ఆయన నేతృత్వంలోని కూటమి పాలించే రాష్ట్రంలోనే ఈ సంఘటన చోటు చేసుకోవడం మాటలకు, చేతలకు పొంతన లేని తనానికి నిదర్శనం. బిజెపి, ఎన్‌డిఎ కూటమి పాలనలోని రాష్ట్రాల్లో ఒక దాని తరువాత ఒకటిగా చోటుచేసుకుంటున్న ఈ తరహా పరిణామాలు అక్కడి ప్రభుత్వాలు మూకహింసనే చట్టంగా మార్చుకుంటూ ప్రజాస్వామ్యానికి తూట్లు పొడుస్తున్న తీరుకు తార్కాణాలు.పెద్దగా పేరులేని ఒక రాజకీయ నాయకుడి ఎదుగుదలను వివరిస్తూ సాగిన హిందీ సినిమా పాటను తన ప్రదర్శనలో అనుకరించిన కునాల్ గద్దార్ (ద్రోహి) అనే పదాన్ని ఉపయోగించారు. దీనిని ఏమాత్రం సహించలేని అక్కడి పాలకపక్షం, తన అధికారాన్ని ఉపయోగించడంతో పాటు, గూండాలను ఆయనపైకి ఉసిగొల్పుతోంది. సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ శాసనసభ వేదికగా భావవ్యక్తీకరణ స్వేచ్ఛపై దాడి చేశారు. ఆయన సమక్షంలోనే శివసేన ఎంఎల్‌ఎ ముర్జి పటేల్ రెండు రోజుల్లో క్షమాపణ చెప్పకపోతే కునాల్ కమ్రాను వీధుల్లోకి తిరగనిచ్చేది లేదని హెచ్చరించారు. ఆ వెంటనే వరుస సంఘటనలు చోటుచేసుకోవడం గమనార్హం. ముంబయి పోలీసులు కమ్రాపై భారతీయ న్యాయ సంహిత కింద ప్రజలకు హాని కలిగించడం, వారి మధ్య శత్రుత్వాన్ని రగిలించడం తదితర సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. కమ్రా చేసిన వ్యాఖ్యకు ప్రజలకు హాని కలిగించడం ఏమిటో అర్థం కాదు. పరువు నష్టం సెక్షన్ల కింద కూడా ముంబయి పోలీసులు కేసు నమోదు చేయడం చర్చనీయాంశంగా మారింది. వ్యక్తిగత హోదాలో వ్యక్తులు మాత్రమే పెట్టవలసిన ఈ కేసును పోలీసులు ఎలా నమోదు చేస్తారన్న ప్రశ్నకు వారి వద్ద నుండి సమాధానం లేదు. ఈ కేసుల తతంగం ఒకవైపు నడుస్తుండగానే మరోవైపు గూండాల గుంపు ఒకటి కమ్రా ప్రదర్శన ఇచ్చిన హేబిటేట్ వేదికపై విరుచుకుపడి ధ్వంసం చేసింది. ఈ విధ్వంసకాండ జరుగుతుండగానే రంగ ప్రవేశం చేసిన బృహత్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ తన వంతు విధ్వంసాన్ని పూర్తి చేసింది. ఆ వేదికకు సంబంధించిన కట్టడంలో మిగిలిన అక్రమాలను కూడా వెలికి తీసి కూల్చివేస్తామని ప్రకటించింది.రాజకీయల్లో ఈ తరహా విమర్శ కొత్త కాదు. పార్టీ ఫిరాయింపు సంఘటనల్లో ఇటువంటి మాటలు వినపడుతుంటాయి. ఇప్పుడు షిండే కొమ్ము కాస్తున్న నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సిపి) నేత అజిత్ పవార్ సైతం తన ప్రత్యర్థులనుద్దేశించి గతంలో ఈ ద్రోహ పదాన్ని ఉపయోగించిన విషయాన్ని పరిశీలకులు ప్రస్తావిస్తున్నారు. ఇక రాజకీయాలపై జరిగే కళాత్మక ప్రదర్శనల్లో వ్యంగ్యం చోటుచేసుకోవడం అసాధారణమేమీ కాదు. ఇటువంటి కారణాల చేతనే బహిరంగ క్షమాపణ చెప్పాలన్న మహారాష్ట్ర ప్రభుత్వ డిమాండ్‌ను కునాల్ కమ్రా తిరస్కరించారు. అదే సమయంలో చట్టబద్ధమైన దర్యాప్తునకు సహకరిస్తానని, కోర్టులు ఆదేశిస్తే క్షమాపణ చెబుతానని ఆయన ప్రకటించారు. మహారాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా ఏకపక్ష, కక్ష సాధింపు చర్యలు మానుకొని, కమ్రాపై బనాయించిన అక్రమ కేసులను ఎత్తివేయాలి. అప్పటి వరకు కమ్రాకు బాసటగా నిలవడం ద్వారా భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత! అక్రమ కేసులు, దాడులు, నిర్బంధంతో కళాకారుల గొంతు నొక్కడం అసాధ్యమన్న విషయాన్ని ఎన్‌డిఎ నేతలు గమనించాలి.

# బాలినేని వర్సెస్ బూచేపల్లి.. జడ్పీవార్



ప్రకాశం, ఆ జిల్లాలో జిల్లా పరిషత్ పీఠాన్నీ జనసేన కైవసం చేసుకోవాలనుకుంటుంది. ఇప్పటికే ఈ విషయాన్నీ జనసేనలోని ఓ కీలక నేత బహిరంగంగా ప్రకటించేశారు. అయితే ఒక్క జడ్పిటీసీ లేని జనసేన, జడ్పీపీఠాన్నీ ఎలా కైవసం చేసుకోగలగుతుందనేది ఉత్కంఠ రేపుతోంది. పోనీ ఆ కీలకనేత తమాషాగా మాట్లడే వ్యక్తా అంటే అది కాదు. మరి జనసేన వైసీపీ చేతిలో ఉన్న జడ్పీ పీఠాన్ని ఎలా దక్కించుకుంటుంది? అసలు దానికి సంబంధించి ఆ జిల్లాలో జరుగుతున్న చర్చేంటి?

ప్రకాశం జడ్పీ పీఠాన్ని కైవసం చేసుకుంటామన్న బాలినేని

ప్రకాశం జిల్లా జడ్పీ పీఠాన్ని కైవసం చేసుకోబోతున్నామని మాజీ మంత్రి, జనసేన నేత బాలినేని శ్రీనివాసరెడ్డి చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం జిల్లా రాజకీయాల్లో దుమారం రేపుతున్నాయి. ఇప్పటికే ఈ విషయంపై జడ్పీ ఛైర్ పర్సన్, వైసీపీ నాయకురాలు బూచేపల్లి వెంకాయమ్మ స్వయంగా బాలినేని పై నిప్పులు చెరిగారు. దమ్ముంటే జిల్లా పరిషత్ కుర్చీని టచ్ చేసి చూడండని సవాల్ విసిరారు. దీంతో బాలినేని, వైసీపీల మధ్య జడ్పీ వార్ పీక్ స్టేజ్‌కి చేరినట్లైంది.

జనసేన సభలో జడ్పీ పీఠంపై చాలెంజ్ చేసిన బాలినేని

ఇటీవల జరిగిన జనసేన అవిర్భావ సభలో ప్రకాశం జిల్లా పాలిటిక్స్‌లో సీనియర్ నేతగా ఉన్న మాజీమంత్రి బాలినేని మాట్లాడారు. అయితే మొదట జగన్‌పై విమర్శలు ఎక్కు పెట్టిన బాలినేని తర్వాత జిల్లా పరిషత్ పీఠంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. పవన్ కళాణ్ ఓకే అంటే ప్రకాశం జిల్లా జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మను గద్దె దించుతానని కామెంట్ చేశారు. దీంతో ప్రకాశం జిల్లా వైసీపీలో ఒక్కసారిగా ప్రకంపనలు మొదలయ్యాయి. జగన్ పై మాట్లాడినందుకే ఒకపక్క ఫ్యాను పార్టీ నేతలు నిప్పులగుండంలా రగిలిపోతుంటే, జడ్పీ పీఠం గురించి మాట్లాడేసరికి ఒక్కసారిగా బాలినేని పై బ్లాస్ట్ అవుతున్నారు. వరుస ప్రెస్ మీట్లతో బాలినేనిపై విరుచుకుపడటం మొదలు పెట్టారు.

జడ్పీటీసీలు బాలినేనికి టచ్‌లోకి వస్తున్నారా?

బాలినేని ఏ ప్లాన్ లేకుండానే బహిరంగంగా ఈ వ్యాఖ్యలు చేసి ఉండరని.. కొంత మంది జడ్పీటీసీలు బాలినేని టచ్‌లోకి వెళ్లినట్లు గుసగుసలు వినపడుతున్నాయి.. ఇప్పటికే ఒంగోలు కార్పొరేషన్లో వైసీపీకు చెందిన 20 మంది కార్పొరేటర్లతో పాటు ముగ్గురు కోఆప్షన్ సభ్యులను జనసేనలోకి తీసుకొచ్చారు. ఈ క్రమంలో ఇప్పటికే జడ్పిటీసీలతో కూడా తెరవెనుక మంతనాలు జరిపి ఉంటారనే ప్రచారం జరుగుతోంది. పలువురు జడ్పీటీసీలు జనసేనలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారనే టాక్ కూడా జిల్లాలో వినపడుతోంది. ఆ ధీమాతోనే బాలినేని జడ్పీ పీఠంపై బహిరంగంగా మాట్లాడారంటున్నారు.

జగన్ మళ్లీ భారీ మెజార్టీతో సీఎం అవుతారని వెంకాయమ్మ జోస్యం

మరోవైపు బాలినేని వర్గం కూడా త్వరలోనే జిల్లా పరిషత్ పై జనసేన జెండా ఎగిరేస్తామని ప్రచారం మొదలుపెట్టారు. అయితే ఆ వ్యాఖ్యలను జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ సహా వైసీపీ నేతలు ఖండిస్తున్నారు. బాలినేనికి జడ్పీ చైర్మన్ సీటును కూడా టచ్ చేయలేరని సవాళ్లు విసరుతున్నారు. జడ్పీ సభ్యులందరు వైసీపీలోనే కొనసాగుతారని ధీమా వ్యక్తం చేస్తున్నారు. పైపెచ్చు ఈ సందర్భంగా వెంకాయమ్మ 2029లో జగన్ 151 సీట్ల కంటే ఎక్కువ మెజార్టీతో ముఖ్యమంత్రి అవుతారని జోస్యం చెప్తుండటం గమనార్హం.

కూటమి శ్రేణులు మరో డౌట్ వ్యక్తం

మరోవైపు ఇక్కడే కూటమి శ్రేణులు మరో డౌట్ వ్యక్తం చేస్తున్నాయి ఇప్పటికే ఒంగోలు కార్పొరేషన్ ను తెలుగుదేశం పార్టీ తన అధీనంలోకి తెచ్చుకుంది. ఆ క్రమంలో జిల్లా పరిషత్ పీఠాన్ని మిత్రపక్షమైన జనసేన దక్కించుకునే ప్రయత్నం చేస్తే టీడీపీ నేతలు సైలెంట్ గా ఉంటారా? అన్నది ఆలోచించాల్సిన విషయమే అంటున్నారు. ఎందుకంటే ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌కు బాలినేని శ్రీనివాసరెడ్డికి మధ్య పచ్చగడ్డి వేయకుండానే రాజకీయ మంటలు రాజుకుంటుంటాయి. ఈ టైంలో బాలినేని జడ్పీలో ఆధిపత్యం కొనసాగిస్తే తనకు ఎఫెక్ట్ పడే అవకాశం ఉందనేది దామచర్ల ఇన్నర్ ఫీలింగ్ అంటున్నారు.

వైసీపీ జిల్లా అధ్యక్షుడు వెంకాయమ్మ కుమారుడు శివప్రసాద్ రెడ్డి

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో మొత్తం 55 మంది జడ్పీ సభ్యులున్నారు. అందరూ వైసీపీ వారే అవ్వడం గమనార్హం. అందులో ముగ్గురు తర్వాత కాలంలో మృతి చెందారు. మరో నలుగురు ఎన్నికలకు ముందు వైసీపీ నుండి టీడీపీలోకి జంప్ అయ్యారు. అయినప్పటికి వైసీపీకి ఇంకా 48 మంది జడ్పీటీసీల బలం ఉంది. . జడ్పీ పీఠం దక్కించుకోవాలంటే 28మంది సభ్యుల మద్దతు సరిపోతుంది. అయినా జడ్పీ పీఠాన్ని జనసేన హస్తగతం చేసుకోవడం అంతా ఈజీ కాదన్న అభిప్రాయం వ్యక్తం అవుతుంది. అందులోనూ జిల్లా పరిషత్ పీఠం బూచేపల్లి కుటుంబం చేతిలో ఉంది. వైసీపీ జిల్లా అధ్యక్షుడుగా వెంకాయమ్మ కుమారుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డే ఉన్నారు.

అవిశ్వాసం పెట్టడానికి తొలగిన అడ్డంకి

ప్రభుత్వం మారిన దగ్గర నుండి శివప్రసాద్ రెడ్డి తన తల్లి పదవిని కాపాడుకోవడానికి,, జడ్పీ సభ్యుల మీద చూపించే కేర్ మరింత పెరిగిందంట. ఎప్పటికప్పుడు వారితో టచ్‌లో ఉంటూ వారిని మానిటరింగ్ చేసుకుంటున్నారంట. ఈ పరిస్థితుల్లో మ్యాజిక్ ఫిగర్‌కు సరిపడా సభ్యులు జనసేన వైపు రావడం అంటే కష్టమనే అంటున్నారు. ఇటీవల బాలినేని చేసిన వ్యాఖ్యలతో వైసీపీ నేతలు మరింత అలెర్ట్ అయిన పరిస్థితి కనపడుతోంది. అదలా ఉంటే జడ్పీ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టేందుకున్న నాలుగేళ్ల ఆర్డినెన్స్ అడ్డంకి కూడా ఇప్పుడు తొలగిపోయింది. ఈ నేపథ్యంలో జడ్పీ పీఠం కైవసం చేసుకోవడానికి డిప్యూటీ సీఎం పవన్ ఓకే అంటారా? ఒకవేళ ఓకే అన్నా బాలినేని తాను ఛాలెంజ్ చేసినట్లు.. మ్యాజిక్ ఫిగర్‌కు అవసరమైన సభ్యులను పార్టీలోకి తీసుకురాగాలరా? అన్నది జిల్లాలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

# ఎస్ఎల్‌బిసి వద్ద కొనసాగుతున్న సహాయకచర్యలు

నాగర్‌కర్నూల్,నాగర్‌కర్నూల్ జిల్లాలోని దోమలపెంట ఎస్ఎల్‌బీసీ సొరంగంలో సహాయక చర్యలు నిర్విరామంగా కొనసాగుతున్నాయి. సొరంగం లోపల జరుగుతున్న సహాయక చర్యల్లో పాల్గొంటున్న సహాయక బృందాల ఉన్నతాధికారులతో ప్రత్యేక అధికారి శివ శంకర్ లోతేటి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ లోపల చిక్కుకున్న వారి ఆచూకీ తెలుసుకునేందుకు నిరంతరాయంగా పనిచేస్తున్న సహాయక బృందాల సహాయక చర్యలపై అభినందిస్తూ, రెట్టింపు వేగంతో సహాయక చర్యలను కొనసాగించాలని అధికారులకు సూచించారు. జీఎస్ఐ అధికారుల సూచనలకు అనుగుణంగా ప్రమాద ప్రదేశం నుంచి 30 మీటర్ల వరకు బారీ కేడింగ్ చేసినట్లు–, జియో లాజికల్ సర్వే ఆఫ్ ఇండియా అధికారులు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా పర్యవేక్షణ జరుపుతున్నట్లు వివరించారు. టన్నెల్ లోపల సహాయక చర్యలలో భాగంగా సొరంగంలో మట్టి తవ్వకాలు కొనసాగిస్తున్నట్లు–, తవ్వకాలకు అడ్డంకిగా ఉన్న స్టీల్‌ను తొలగిస్తూ, ఎప్పటికప్పుడు ఊట నీటిని పంపుల ద్వారా బయటకు తరలిస్తున్నట్లు– వివరించారు. ప్రమాద ప్రదేశం సమీపంలో మట్టి కింద ఉన్న లోకో –ట్రైన్ క్యాబిన్లను తొలగించి లోకో ఇంజిన్‌ను బయటకు తీసేందుకు, సహాయక బృందాలు పూర్తిస్థాయిలో చర్యలు వేగవంతం చేస్తున్నాయన్నారు. ప్రమాద ప్రదేశం సమీపంలో ఉన్న పెద్దపెద్ద బండరాళ్లను ఎస్కవేటర్ ద్వారా తొలగిస్తూ, టీ–బీఎం భాగాలను అల్ట్రా థర్మల్ కట్టర్‌తో కట్ చేస్తూ వాటి భాగాలను లోకో – ట్రైన్ ద్వారా బయటకు తీసుకువస్తున్నట్లు– తెలిపారు.

# భవనం కూలిన ఘటనలో న్యాయం చేయాలని ఆందోళన

భద్రాచలం,భవనం కుప్పకూలిన ఘటనలో శిథిలాల కిందపడి చనిపోయిన మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలని కుల సంఘాలు, వామపక్ష, కుల సంఘా నాయకులు, తాపీమేస్త్రి ఉపేందర్ బంధువులు ఆందోళనకు దిగారు. బాధిత కుటుంబాలకు రూ.కోటి నష్ట పరిహారం చెల్లించాలని, ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించాలని డిమాండ్ చేశారు. ఆ తర్వాతే మృతదేహాలకు పోస్టుమార్టం చేయాలని ప్రభుత్వ దవాఖాన మార్చురీ ఎదుట ధర్నాకు దిగారు. సమాచారం అందుకున్న పోలీసులు హాస్పిటల్‌కు చేరుకున్నారు. వారికి సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. శ్రీపతి సేవా ట్రస్టు పేరిట భద్రాచలంలోని గ్రామ పంచాయతీ కార్యాలయ సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న ఆరు అంతస్థుల భవనం బుధవారం కూలిన ఘటన విషాదాన్ని మిగిల్చిన సంగతి తెలిసిందే. శిథిలాల కింద చిక్కుకుని తాపీమేస్త్రి ఉపేందర్, కార్మికుడు కామేశ్వర్‌రావు మృతిచెందారు. గురువారం శిథిలాల్లో చిక్కుకుపోయిన తాపీమేస్త్రి కామేశ్వర్‌రావును అధికారులు ప్రాణాలతో బయటకుతీశారు. కానీ అప్పటికే కాలు, చెయ్యి నుజ్జునుజ్జయి, తీవ్ర రక్తస్రావం జరిగిన కామేశ్వర్‌రావు దవాఖానకు తరలించిన వెంటనే ప్రాణాలు వదిలాడు. శుక్రవారం ఉదయం ఉపేందర్ మృతదేహాన్ని శిథిలాల కిందినుంచి రెస్క్యూ సిబ్బంది వెలికి తీసింది. పోస్టుమార్టం అనంతరం ఉపేందర్ డెడ్‌బాడీని ఆయన కుటుంబ సభ్యులకు అందజేయనున్నారు.

# సమస్యలకు చావే పరిష్కారం కాదు

హైదరాబాద్, చిన్నచిన్న విషయాలకు ఆవేశంతో ఆత్మహత్యలకు పాల్పడవద్దని, దానివల్ల వారి కుటుంబాలు అనాథాలుగా మిగులుతున్నారని మాజీ ఎమ్మెల్సీ ఫారుఖ్ హుస్సేన్ అన్నారు. సిద్దిపేట జిల్లా రాయపోల్ మండల కేంద్రానికి చెందిన మహమ్మద్ షాదుల్లా అనే వ్యక్తి అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న విషయం తెలుసుకున్న పారుఖ్ హుస్సేన్ బాధిత కుటుంబ సభ్యులను శుక్రవారం ఉదయం పరామర్శించారు. రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. చిన్న వయసులోనే షాదుల్లా మృతి చెందడం బాధాకరమన్నారు. ఆ కుటుంబానికి తాము ఎల్లప్పుడూ అండగా ఉండి వారి పిల్లలను మైనార్టీ హాస్టల్లో చేర్పించి విద్యాబుద్ధులు నేర్పిస్తామని పేర్కొన్నారు. ఆవేశంతో యువకులు ఆత్మహత్యలు చేసుకోవడం బాధాకరమని. వారు ఆత్మహత్యలు చేసుకుంటే కుటుంబాలు అనాథలుగా మిగులుతాయని విచారం వ్యక్తం చేశారు. షాదుల్లా వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నప్పటికీ వ్యాపారంలో నష్టం రావడం, అప్పులు బాధతో ఆత్మహత్య పరిష్కారంకాదన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు ఆపద ఎక్కడ ఉంటే తాను అక్కడ ఉంటానన్నారు. పదవులు ఎప్పుడూ ఎవరికీ శాశ్వతం కాదని చెప్పారు. తనకు పదవి ఉన్నా లేకున్నా దుబ్బాక ప్రజలతో 30 ఏండ్ల అనుబంధం ఉందని తెలిపారు. తన ప్రాణం ఉన్నంతవరకు దుబ్బాక నియోజకవర్గ ప్రజలను ఎప్పుడు మరిచిపోనని ఆయన గుర్తు చేశారు. గ్రామాల్లో యువకులు మందు కల్లు తాగుడు, బెట్టింగులకు అలవాటు పడంతో ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని గుర్తు చేశారు. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చదివిస్తే విద్యార్థులు మంచిగా చదువుకొని ఉన్నత స్థాయిలో ఉంటే అందరూ సంతోషం వ్యక్తం చేస్తారన్నారు. ఆయన వెంట ఉమ్మడి మండల బీఆర్ఎస్ అధ్యక్షులు చింతకింది మంజూరు, సీనియర్ నాయకులు సత్తుగారి కిష్టారెడ్డి, మాజీ సర్పంచ్ కుమ్మరి శ్రీనివాస్ చారి, మండల మైనార్టీ సెల్ అధ్యక్షులు మహమ్మద్ యూసుఫ్, ఇసాక్, మహమ్మద్ రఫీ, గ్రామ నాయకులు బాసం నరసింహారెడ్డి, గౌరీ గారి పరుశరాములు, బంగారెడ్డి లింగారెడ్డి, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

# సభా వేదిక మార్పు?

హైదరాబాద్,అధికారం కోల్పోయి ప్రతిపక్షంలోకి వచ్చాక నిర్వహిస్తున్న మొట్టమొదటి బహిరంగ సభ కావడం, పార్టీ సిల్వర్ జూబ్లీ సభ అవ్వడం, అందులోనూ కేసీఆర్ హాజరయ్యే సభ కావడంతో గ్రాండ్ సక్సెస్ చేయాలనే పట్టుదలతో ఉందట గులాబీ పార్టీ.ముందుగా ప్రకటించిన ప్రకారం ఓరుగల్లులోనే సభ పెడుదామా? లేదంటే మరోచోటకు మార్చుదామా? బహిరంగ సభ సక్సెస్ కావాలంటే ఎక్కడ సభ పెడితే బాగుంటుందన్న దానిపై చర్చోపచర్చలు చేస్తోందట బీఆర్ఎస్. పార్టీ సిల్వర్ జూబ్లీ ఉత్సవాల్లో భాగంగా వచ్చే నెల 27న వరంగల్‌లో భారీ బహిరంగ సభ పెట్టాలని డిసైడ్ చేసింది గులాబీ నాయకత్వం.అందుకు అనుగుణంగా పార్టీ ముఖ్యనేతలు హరీశ్‌రావు, పల్లారాజేశ్వర్‌రెడ్డితో పాటు ఓరుగల్లు నేతలంతా బహిరంగ సభ కోసం స్థలాలను పరిశీలించారు. వరంగల్ చుట్టు పక్కల ఎక్కడ ఎక్కువ స్థలం ఉంది..సభా స్థలం, పార్కింగ్ ప్లేస్ అంతా సెట్ అవుతుందా లేదా అని ఆరా తీశారు.బహిరంగ సభకు అనుమతి కోసం దరఖాస్తు చేసుకోవడంతో పాటు అందుకు సంబందించిన ఏర్పాట్లు కూడా మొదలయ్యాయి. మీటింగ్ ఏర్పాట్లు స్పీడప్ చేయాలనుకున్న క్రమంలోనే గులాబీ అధిష్టానం పునరాలోచనలో పడ్డట్లు చర్చ జరుగుతోంది. ఉద్యమ కాలంలో, తొమ్మిదిన్నరేళ్లు అధికారంలో ఉన్నప్పుడు బీఆర్ఎస్ ఎన్నో బహిరంగ సభలు నిర్వహించింది.కనీవినీ ఎరుగని రీతిలో లక్షల మందితో సభలు, సమావేశాలు ఆర్గనైజ్ చేసింది. ఎప్పుడు ఏ కార్యక్రమానికి పిలుపు ఇచ్చినా లక్షలాదిమంది తమ సభలకు తరలివస్తారనే ధీమా ఆ పార్టీలో కనిపించేది. కానీ ఇప్పుడు మొట్టమొదటిసారి ప్రతిపక్షంలోకి వచ్చాక నిర్వహించాలనుకుంటున్న సభ విషయంలో మాత్రం కొంత ఆందోళన కనిపిస్తున్నట్లు చర్చ జరుగుతోంది.

వరంగల్‌లో ఎన్నో సభలు

ఇదే వరంగల్‌లో ఉద్యమ కాలం నుంచి అధికారంలో ఉన్నప్పుడు కూడా చాలా సభలు పెట్టింది బీఆర్ఎస్. అదే తరహాలో పార్టీ సిల్వర్ జూబ్లీ సెలబ్రేషన్స్ సందర్భంగా ఓరుగల్లు వేదికగా భారీ పెట్టాలని అనుకున్నప్పటికీ బీఆర్ఎస్ నేతలకు కొంత సందేహం కలుగుతోందనే టాక్ వినిపిస్తోంది.వరంగల్‌లో సభ నిర్వహించే ప్రాంతం అందరికీ అనుకూలంగా లేకపోవడంతో బీఆర్ఎస్ అధిష్టానం పునరాలోచనలో పడినట్లు తెలుస్తోంది. సమయం కూడా ఏప్రిల్ చివరి వారం కావడం, ఎండలు విపరీతంగా ఉంటే ఇబ్బందులు రావొచ్చని భావిస్తున్నారట. దూరప్రాంతాల నుంచి వరంగల్‌కు జనం తరలివస్తారా రారా అన్న అనుమానం కూడా పట్టి పీడిస్తోందట.ఓరుగల్లులో బహిరంగ సభ నిర్వహిస్తే సక్సెస్ అవుతుందా లేదా అన్న డౌట్‌లో గులాబీ నేతలు ఉన్నారట. సిల్వర్ జూబ్లీ సభకు దాదాపు ఐదు లక్షల మంది వస్తారని చెప్పుకుంటున్నా..ఆ సమయంలో జనం వ్యవసాయ పనుల్లో నిమగ్నమై ఉంటే అంత మందిని వరంగల్‌కు తరలించడం ఇబ్బంది అవుతుందేమోనని భావిస్తున్నారట. అందుకే సభా వేదికను మారిస్తే ఎలా ఉంటుందని ఆలోచిస్తున్నారట పార్టీ అధినేత కేసీఆర్.వరంగల్ కంటే హైదరాబాద్ శివారు ప్రాంతం అయితే బాగుంటుందని గులాబీ బాస్ ఆలోచిస్తున్నట్లు పార్టీ వర్గాల సమాచారం. అందులోనూ ఔటర్ రింగ్ రోడ్డు దగ్గరలో అయితే జనం వచ్చి పోవడానికి ఈజీగా ఉంటుందని అనుకుంటున్నారట.

# ఐఐటీల స్థాపన గొప్ప ముందడుగు

చెన్నై, ఐఐటీల స్థాపన దేశ విద్యారంగంలో గొప్ప ముందడుగు అని ఏపి సిఎం చంద్రబాబు నాయుడు చెప్పారు. ఆర్థిక సంస్కరణలు దేశ ముఖ చిత్రాన్ని సమూలంగా మార్చేశాయన్నారు. 1991లో తీసుకొచ్చిన సంస్కరణలు ఎంపిక కాదు.. తప్పనిసరి అని చంద్రబాబు తెలిపారు. రాజకీయ సంస్కరణలతో సోవియట్ రష్యా అనేక దేశాలుగా విడిపోయిందని అదే సమయంలో చైనా ఆర్థిక సంస్కరణలను ప్రారంభించిందని,ఆ తర్వాత ప్రపంచంలోనే రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆ దేశం ఎదిగింది అని చెప్పారు. భారత్ కూడా సంస్కరణల తర్వాత అభివృద్ధి బాట పట్టిందన్నారు. అందుకే దేశానికి మరో 40 ఏళ్ల వరకూ జనాభా సమస్య లేదు అని సిఎం చంద్రబాబు అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చెన్నైలో పర్యటిస్తున్నారు. శుక్రవారం మద్రాస్ ఐఐటీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 'ఆల్ ఇండియా రీసెర్చ్ స్కాలర్స్ సమ్మిట్-2025'లో పాల్గొన్న ముఖ్యమంత్రి ... ఐఐటీ విద్యార్థులతో మాట్లాడారు. కొంతకాలంగా భారత్ వృద్ధిరేటు ప్రపంచంలోనే అత్యధికంగా ఉంటోందన్నారు. 2014లో మనది ప్రపంచంలో 10వ ఆర్థిక వ్యవస్థ అని, ఇప్పుడు ఐదో స్థానానికి చేరిందని చెప్పారు. భారత్‌కు ఉన్న గొప్పవరం జనాభా అని, డెమోగ్రాఫిక్ డివిడెండ్ అని అన్నారు. మనమంతా కలిసి చేస్తే త్వరలోనే ప్రపంచంలో భారత్ అగ్రస్థానానికి చేరుకుంటుందని అన్నారు. చాలా దేశాలు జనాభా తగ్గదల సమస్యను ఎదుర్కొంటున్నాయని, మన దేశానికి మరో 40 ఏళ్ల వరకూ ఆ సమస్య లేదు అని చంద్రబాబు ప్రసంగించారు. మద్రాస్ ఐఐటీ ఎన్నో విషయాల్లో నంబర్ వన్‌గా ఉందన్నారు. ఆన్‌లైన్ కోర్సులు కూడా అందిస్తోందని తెలిపారు. ఐఐటీ మద్రాస్ స్టార్టప్ అగ్రికల్ మంచి విజయాలు అందుకుందని ప్రశంసించారు. ఇక్కడి స్టార్టప్‌లు 80 శాతం విజయవంతమవుతున్నాయన్నారు. ఈ ఐఐటీలో సుమారు 35–40 శాతం తెలుగు విద్యార్థులే ఉన్నారని హర్షాన్ని వ్యక్తం చేశారు. బ్రిటీష్‌వారు మన దేశం నుంచి అంతా తీసుకెళ్లారనీ, ఒక్క ఇంగ్లీషును మనకు వదిలేశారని విమర్శించారు. 1990లలో కమ్యూనికేషన్ రంగంలో బీఎస్ఎన్ఎల్, వీఎస్ఎన్ఎల్ గుత్తాధిపత్యం ఉండేదని తెలిపారు. ఆర్థిక సంస్కరణల తర్వాత కమ్యూనికేషన్ల రంగంలో ప్రైవేటు సంస్థల రాక ఓ గేమ్ ఛేంజర్ అని అభివర్ణించారు. మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్‌ను మొదట కలుస్తానని అడిగినప్పుడు రాజకీయ నేతలతో సంబంధం లేదని చెప్పారు. ఆయన్ను ఒప్పించి అపాయింట్‌మెంట్ తీసుకున్నానన్నారు. 45 నిమిషాలు తనతో మాట్లాడారని తెలిపారు. హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ సంస్థ నెలకొల్పాలని కోరానన్నారు. ఇప్పుడు అదే సంస్థకు సీఈవోగా తెలుగు వ్యక్తి సత్య నాదెళ్ల ఉన్నారని సిఎం తెలిపారు. ఇప్పుడు ప్రపంచమంతా భారత్ వైపు చూస్తోందని చంద్రబాబు అన్నారు. భవిష్యత్ అంతా భారతీయులదేనని చెప్పారు. మరోవైపు సీఎం చంద్రబాబుకు మద్రాస్ ఐఐటీ- విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. కార్యక్రమంలో ఆయన ప్రస్తావన వచ్చినప్పుడల్లా కేరింతలు, చప్పట్లతో ప్రాంగణం మార్మోగింది.

# న్యాయవ్యవస్థకు తీరని కళంకాలు

న్యూఢిల్లీ,న్యాయవ్యవస్థ లోని న్యాయమూర్తులంటే ధర్మరక్షకులు అన్న నమ్మకం ప్రజలకు ఉంటుంది. అయితే కొందరి న్యాయమూర్తుల తీరు వివాదాస్పదం కావడం న్యాయవ్యవస్థకే తీరని అప్రతిష్టలను తెచ్చిపెడుతుంది. ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్‌వర్మ నివాసంలో జరిగిన అగ్నిప్రమాదంలో కరెన్సీ నోట్ల కట్టలు కాలి ఉన్నాయని వార్తలు రావడం పెద్ద దుమారం రేపుతోంది. సుప్రీం కోర్టు వెబ్‌సైట్‌లో కూడా ఈ వీడియో ఉండడం గమనార్హం. ఇదంతా అబద్ధమని, కొందరు పన్నిన కుట్ర అని సంబంధిత న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ సంజాయిషీ ఇస్తున్నారు. అయితే ఈ సంఘటనకు సంబంధించి కొన్ని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ నెల 14 వ తేదీ అర్ధరాత్రిన వర్మ నివాసంలో అగ్నిప్రమాదం జరగ్గా కరెన్సీ కట్టలు కాలిపోవడం గురించి 21 వ తేదీ వరకు మీడియా బయటపెట్టే వరకు అధికారికంగా ఎందుకు వెల్లడించలేదో అర్థం కావడం లేదు. పోలీస్ విభాగం, అగ్నిమాపక అధికార యంత్రాంగం దీనిపై ఏం మాట్లాడడం లేదు.అసలు కరెన్సీ కట్టలు కాలిపోవడం గురించి చెప్పకుండా మరేదో కథనాలు వెల్లడిస్తున్నారు. ప్రాథమికంగా విచారణ చేపట్టిన ఢిల్లీ పోలీస్ కమిషనర్ సంజయ్ అరోరా మాత్రం జడ్జి ఇంటి ఆవరణలో సగం కాలిన నోట్లు, ఇతర శిథిలాలను తర్వాత రోజు తొలగిస్తున్న దృశ్యాలను ఆధారాలతో సహా చీఫ్ జస్టిస్ డికె ఉపాధ్యాయకు ఇచ్చిన నివేదికలో పేర్కొన్నారు. జస్టిస్ యశ్వంత్ వర్మపై అంతర్గత విచారణ నిర్వహిస్తున్నామని సుప్రీం కోర్టు మొదట చెప్పింది. తరువాత విధులకు దూరంగా ఆయన ఉంటారని పేర్కొంది. ఆ తరువాత అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేస్తున్నామని ప్రకటించింది. అలహాబాద్ హైకోర్టు బార్ అసోసియేషన్ దీనికి అభ్యంతరం లేవదీస్తోంది. జస్టిస్‌వర్మను తమ కోర్టుకు బదిలీ చేయరాదని ఆందోళన చేస్తోంది. వర్మ నివాసంలో లెక్కలేనన్ని కరెన్సీ నోట్లు బయటపడిన నేపథ్యంలో వర్మ గతంలో ఇచ్చిన తీర్పులన్నీ మరోసారి విచారించాలన్న వాదన ఎక్కువగా తెరమీదకు వస్తోంది. కరెన్సీ కట్టల ఉదంతంపై ఎఫ్ఐఆర్ నమోదు చేసేలా ఢిల్లీ పోలీసులను ఆదేశించాలని సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలైంది. హైకోర్టు, సుప్రీం కోర్టు న్యాయమూర్తులపై ఎలాంటి నేర విచారణ జరపకూడదన్న 1991 నాటి సుప్రీం కోర్టు తీర్పును సవాల్ చేస్తూ అడ్వకేట్ మాథ్యూస్ నెడుంపారా తదితరులు కేసు వేశారు. ఈ తీర్పు న్యాయవ్యవస్థ జవాబుదారీ తనాన్ని ప్రశ్నార్థకం చేస్తోందని వారు పిటిషన్‌లో పేర్కొన్నారు. హైకోర్టు, సుప్రీం కోర్టు న్యాయమూర్తులపై కేసు నమోదుకు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి ముందస్తు అనుమతి కావాలన్న నిబంధనను తొలగించాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. జస్టిస్ వర్మ కరెన్సీ నోట్ల ఉదంతం పార్లమెంట్ ఉభయ సభల్లోనూ ప్రకంపనలు సృష్టించింది. ఈ అంశంపై చర్చించాలని విపక్షాలు పట్టుబట్టాయి. ప్రజాస్వామ్యంలో పారదర్శకతకు ప్రాధానం ఇచ్చే న్యాయవ్యవస్థలో ఇలాంటి అవినీతి ఆరోపణలు ముసురుకోవడం ప్రజలకు ఆందోళన కలిగిస్తోంది, సుప్రీం కోర్టు, హైకోర్టు న్యాయమూర్తుల్లో 50 శాతం మంది అవినీతిపరులే అని సుప్రీం కోర్టు న్యాయమూర్తి మార్కండేయ కట్జూ గతంలో వ్యాఖ్యానించడం ఈ సందర్భంగా ప్రస్తావించవలసి ఉంది. అలహాబాద్ హైకోర్టులోని న్యాయమూర్తుల్లో అవినీతికి పాల్పడుతున్న వారి వివరాలను



బయటపెట్టడానికి ఆయన చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. జస్టిస్‌వర్మ కూడా అలహాబాద్ హైకోర్టులో పనిచేసినప్పుడు ఒక ప్రయివేట్ సుగర్ మిల్లు యాజమాన్యంతో కుమ్మక్కయి ఒక ప్రయివేట్ బ్యాంకు రుణాల భాగోతంలో పాలు పంచుకున్నారని ఆరోపణలు 2018 లో వచ్చాయి. ఆనాడు అలహాబాద్ హైకోర్టు కూడా జస్టిస్ వర్మపై విచారణకు పూనుకుంది. ఈ కారణం వల్లనేమో జస్టిస్ వర్మ భాగోతం తెలిసిన అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్‌వర్మను తమ వద్దకు బదిలీ చేయరాదన్న డిమాండ్‌తో ఆందోళన సాగిస్తున్నారు. ఈ సంఘటన తనను ఎంతగానో బాధపెట్టిందని ఉప రాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్, జగ్‌దీప్ ధన్‌ఖడ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశంపై చర్చించడానికి పార్టీల ఫ్లోర్‌లీడర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొలీజియమ్ వ్యవస్థ లోని లోపాలను తీర్చిదిద్దడానికి జాతీయ న్యాయనియామకాల కమిషన్ (ఎన్‌జెఎసి)చట్టాన్ని తిరిగి అమలు లోకి తీసుకురావలసిన అవసరాన్నిప్రస్తావించారు. కార్య నిర్వాహక , న్యాయవ్యవస్థ, శాసనసభలు ఒకదానికొకటి వ్యతిరేకంగా పోటీ పడుతున్నట్టు భావించరాదని సూచించారు. న్యాయమూర్తుల నియామక ప్రక్రియలో కార్యనిర్వాహక వర్గానికి ఎక్కువ ప్రాధాన్యత కల్పించే ఈ చట్టాన్నిపార్లమెంట్ ఉభయ సభలూ 2014 లో దాదాపు ఏకగ్రీవంగా ఆమోదించినా 2015లో సుప్రీం కోర్టు కొట్టివేసింది. న్యాయమూర్తుల నియామకంలో బంధుప్రీతి, పక్షపాతం వంటి ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నందున ఎన్‌జెఎసి చట్టాన్ని ఇప్పుడు తెరపైకి తీసుకువస్తున్నారు. 2018 నుంచి గత ఏడేళ్లలో వివిధ హైకోర్టుల్లో నియామకమైన జడ్జీల్లో 78 శాతం ఉన్నత కులాలకు చెందినవారేనని గత వారం పార్లమెంట్ ఒక ప్రశ్నకు సమాధానం చెప్పడం గమనార్హం. న్యాయవ్యవస్థ స్వతంత్ర ప్రతిపత్తి, ప్రతిష్ఠ దెబ్బతినడానికి కొందరు న్యాయమూర్తుల తీరుతెన్నులే కారణమవుతోంది. పదవీ విరమణ తరువాత న్యాయమూర్తులు మరే పదవిని ఆశించరాదని 1958 లోనే లా కమిషన్ సూచించినప్పటికీ ఆ సూచనలు బేఖాతరు అవుతున్నాయి. జస్టిస్ రంజన్ గగోయ్ తన పదవీ విరమణ కాగానే రాజ్యసభ పదవి వరించింది. అలాగే జస్టిస్ అబ్దుల్ నజీర్ పదవీ విరమణ కాగానే గవర్నర్ అయ్యారు. ఇలాంటి సంఘటనలు జరుగుతుంటే న్యాయవ్యవస్థ పై ప్రజల్లో , న్యాయార్థుల్లో ఎంతవరకు పారదర్శకత, నమ్మకం, గౌరవం కలుగుతుందో ఆలోచించాల్సిందే !

# మరోమారు రాహుల్ అమెరికా పర్యటన

న్యూఢిల్లీ,కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మరోమారు అమెరికా పర్యటనకు వెళ్లనున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు పార్టీ వర్గాలు వెల్లడించినట్లు- ఆంగ్ల మీడియాల్లో కథనాలు వస్తున్నాయి. ఏప్రిల్ 19 నుంచి రాహుల్ అగ్రరాజ్యంలో పర్యటిస్తారు. ఈసందర్భంగా ఆయన బ్రౌన్ యూనివర్శిటీని సందర్శిస్తారు. బోస్టన్‌లో ప్రవాస భారతీయులతోనూ ఆయన భేటీ అయ్యే అవకాశం ఉంది. అయితే, ఆయన యూఎస్‌లో ఎన్ని రోజులు పర్యటిస్తారనేది తెలియదు. అంతేకాక.. దీనిపై పార్టీ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన లేదు. గతేడాది సెప్టెంబరులో మూడ్రోజులు రాహుల్ యూఎస్‌లో పర్యటించారు. ఆ సమయంలో ఆయన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో రిజర్వేషన్లు, భారత్‌లో మత స్వేచ్ఛ వంటి అంశాలపై రాహుల్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. ప్రస్తుతం భారత్‌లో ఆదివాసీలు, దళితులు, ఓబీసీలకు సరైన ప్రాధాన్యం దక్కడం లేదని రాహుల్ అన్నారు. అప్పటివరకు అభివృద్ధిలో వారి భాగస్వామ్యం కూడా అంతంతమాత్రంగానే ఉంటుందని, దేశంలో అన్నివర్గాల వారికీ పారదర్శకంగా అవకాశాలు లభించే పరిస్థితులు వచ్చిన తర్వాతే రిజర్వేషన్ల రద్దు గురించి తమ పార్టీ ఆలోచిస్తుందన్నారు. ఇక, సిక్కులను ఉద్దేశిస్తూ ఆయన చేసిన వ్యాఖ్యలు వివాదానికి దారితీశాయి. భాజపా ఆయన మాటలను ఖండించింది. విదేశాల్లో భారత్ పరువుతీస్తున్నారని మండిపడింది. సిక్కులను ఉద్దేశిస్తూ ఆయన చేసిన వ్యాఖ్యలకు వ్యతిరేకంగా.. భాజపా మద్దతున్న ఒక గ్రూప్ దిల్లీలోని సోనియాగాంధీ నివాసం వెలుపల నిరసనలు సైతం తెలియచేసింది.

# రైతులపై దమనకాండ దారుణం

పటియాలా, రైతుల నిరసనల్లో జరిగిన నష్టానికి రైతులకు నష్టపరిహారాన్ని ఇవ్వాలని కిసాన్ మజ్దూర్ సంఘర్ష్ కమిటీకి చెందిన రైతు నేత సర్వన్ సింగ్ పాంధర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులపట్ల కర్కశంగా వ్యవహరిస్తున్నదని పంజాబ్‌లోని ఆప్ ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. రైతుల డిమాండ్లను పరిష్కరించకపోగా.. నిరసనలు చేస్తున్న రైతుల పట్ల కర్కశంగా వ్యవహరిస్తున్న సిఎం భగవంత్‌మాన్, ఆప్ ప్రభుత్వంపైనా ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నేడు ఆయన ముక్త్‌సర్ సాహిబ్ జైలు నుండి విడుదలయ్యాడు. రైతుల ఉద్యమాన్ని అణిచివేస్తున్న ఆప్ ప్రభుత్వ చర్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. ఆయన జైలు నుంచి విడుదల అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. 'కేంద్ర ప్రభుత్వం రైతుల ఆందోళలను అణచివేస్తోంది. దీనికి వ్యతిరేకమని రైతుల నిరసనలకు మద్దతిస్తామని ఆప్, సిఎం భగవంత్ మాన్ చెబుతున్నారు. కానీ పంజాబ్‌లో వాస్తవానికి జరుగుతున్నదేంటి? ఆప్ ప్రభుత్వం కూడా రైతు ఉద్యమాన్ని అణచివేస్తోంది. వారి న్యాయమైన డిమాండ్ల కోసం నిరసనలు చేస్తున్న రైతులపై పంజాబ్ ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకుంటు-ంది? ప్రభుత్వ చర్యల వల్ల మా -టె-ంట్లు-, ట్రాక్టర్లు మొదలైన వాటికి నష్టం వాటిల్లింది. వీటికి నష్టపరిహారాన్ని ప్రభుత్వం ఇవ్వాలి. మా డిమాండ్లు నెరవేరే వరకు మా ఉద్యమం కొనసాగుతుంది' అని ఆయన అన్నారు.

# మరోమారు ప్రధాని మోడీ విదేశీ పర్యటన

న్యూఢిల్లీ, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మరోసారి విదేశీ పర్యటనకు వెళ్లనున్నారు. ప్రధాని నరేంద్ర మోడీ వచ్చేనెల ఏప్రిల్లో విదేశీ పర్యటనకు థాయ్‌లాండ్, శ్రీలంక దేశాలకు వెళ్లనున్నారు. ఏప్రిల్ 3–4 తేదీల్లో థారులాండ్ ఆతిథ్యం ఇస్తున్న ఆరవ బిఐఎంఎస్‌టిఇసి (శిఖరాగ్ర సమావేశంలో పాల్గొనగడానికి బ్యాంకాక్‌లో పర్యటించనున్నట్లు- భారత విదేశాంగ మంత్రిత్వశాఖ శుక్రవారం వెల్లడించింది. అనంతరం మోడీ ఏప్రిల్ 4–6 వరకు శ్రీలంకలో పర్యటించనున్నారు. మూడురోజుల పర్యటనలో భాగంగా ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాలపై కొలంబోలో శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార దిసనాయకతో మోడీ చర్చలు జరపున్నట్లు- భారత విదేశాంగ వ్యవహారాల మంత్రిత్వశాఖ తెలిపింది. ఈ రెండు దేశాల పర్యటనలకు సంబంధించిన షెడ్యూల్ ఖరారైనట్లు- విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తాజాగా వెల్లడించింది. ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది. ముందుగా ఏప్రిల్ 3 - 4 తేదీల్లో ప్రధాని థాయ్‌లాండ్‌లో పర్యటించనున్నారు. థాయ్‌లాండ్ ప్రధాని పేటోంగ్టార్న్ షినవత్రఆహ్వానం మేరకు ఆ దేశ పర్యటనకు వెళ్లబోతున్నారు. ఈ సందర్భంగా పేటోంగ్టార్న్‌తో భేటీ కానున్నారు. ఏప్రిల్ 4వ తేదీన బ్యాంకాక్‌లో జరగనున్న 'బే ఆఫ్ బెంగాల్ ఇనీషియేటివ్ ఫర్ మల్టీ సెక్టోరల్ టెక్నికల్ అండ్ ఎకనామిక్ కోఆపరేషన్'కూటమి సమావేశంలో పాల్గొంటారు. ఈ సమావేశంలో వాణిజ్యం, పెట్టు-బడులు, నైపుణ్యాభివృద్ధి వంటి అంశాలంపై దేశాధినేతలతో చర్చించనున్నారు. ఆ తర్వాత థాయ్‌లాండ్ పర్యటనను ముగించుకొని ప్రధాని ఏప్రిల్ 4న శ్రీలంక వెళతారు. ఏప్రిల్ 6వ తేదీ వరకూ ఆ దేశంలో పర్యటించనున్నారు. ఆ దేశాధ్యక్షుడు అనురకుమార దిసనాయకే గతేడాది భారత్‌లో పర్యటించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆయన ఆహ్వానం మేరకు మోదీ శ్రీలంక పర్యటనకు వెళ్లబోతున్నారు. మోదీ తన పర్యటనలో రెండు దేశాల మధ్య కుదిరిన పలు ఒప్పందాలపై చర్చించనున్నారు.

# వికాస 'తిరస్కరణ'



హైదరాబాద్,ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏ పథకం పొందాలన్నా, దరఖాస్తు చేసుకోవాలన్నా ఆధార్‌కార్డు తప్పనిసరి. కార్డులో మార్పులు, చేర్పులు చేసుకునేందుకు, కొత్తగా పొందడానికి, ఉన్నవారు ఫోన్ నెంబరును లింకు, పైగా తాజా ఫొటో చేర్చాలనే నిబంధనతో ఇంటిల్లిపాది 'మీసేవ', ఆధార్ అప్‌డేట్ కేంద్రాల చుట్టూ నిత్యం ప్రదక్షిణలు చేస్తున్న పరిస్థితి కనిపిస్తూనే ఉంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వకాలం నుంచి కొత్త రేషన్‌కార్డులు అందించకపోగా మార్పులకు కూడా నోచని దుస్థితి. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డుల జారీకి హామీనిచ్చినా.. ప్రకటనలే తప్ప సరైన స్పష్టత లేదనే విమర్శలనేకం. ఈ నేపథ్యంలో ఆధార్ అప్‌డేట్ సమస్యలు, రేషన్‌కార్డుకోసం దరఖాస్తుదారుల తిప్పలు, వెరసి యువత అనేక సమస్యలు ఎదుర్కొంటున్నది. నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాలు ఇచ్చేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ వేదికగా రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రకటించారు. ఈ పథకం ద్వారా యాభై శాతం వరకు బ్యాంకుల ద్వారా రుణాలిప్పించి యూనిట్‌ను బట్టి రూ.40వేల నుంచి 80 వేల వరకు సబ్సిడీ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. ఈ పథకానికి మార్గదర్శకాలు రాకపోయినా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవడానికి ఏప్రిల్ ఐదు గడువు. గతంలో ఆయా కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారి డేటాను వెబ్‌సైట్ నుంచి తొలగించకపోవడంతో కొత్తగా దరఖాస్తులు ఎంట్రీ కావడం లేదు. దీంతో నిరుద్యోగ యువత ఇబ్బందుల ఇక్కట్లు అన్నీఇన్నీకావు. ఈ పథకానికి కూడా రేషన్ కార్డుతో ముడి పెట్టడంతో కార్డులు లేని వాళ్లు ఉపాధి కోల్పోవాల్సిన పరిస్థితి. దీంతో నిరుద్యోగుల కష్టాలు వర్ణణాతీతం. కొత్తగా పెండ్లయినవారు ప్రభుత్వ పథకాలు పొందడానికి ఉమ్మడి కుటుంబంలో ఉన్న రేషన్‌కార్డు నుంచి పేర్లు రద్దు చేసుకుని కొత్తకార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వారికి కొత్తవి రాకపోగా, ఉన్న పాత రేషన్‌కార్డులో పేరు డిలీట్ కావడంతో తాజాగా ప్రభుత్వం ప్రకటించిన రాజీవ్ యువ వికాసం పథకం సైతం పొందలేకపోతున్నామని యువత ఆవే దన చెందుతున్నది. కొత్త రేషన్ కార్డులు జారీ చేసే విషయం ఎలా ఉన్నా.. కనీసం ఆ కార్డుల్లో మార్పులు, చేర్పులు చేసేం దుకు కూడా అవకాశం లేకపోవడంతో పేదలు తీవ్రంగా నష్టపోతున్నారు. దీంతో దరఖాస్తు దారుల పరిస్థితి 'కొండ నాలుకకు మందేస్తే..ఉన్న నాలుక ఊడిందన్న' చందంగా మారింది. మరోవైపు కోటి ఆశలతో రాజీవ్ యువ వికాసం పథకానికి యువత చేసుకుంటున్న దరఖాస్తులు తిరస్కరణకు గురవుతూ నిరుద్యోగ యువత ఆశలపై నీళ్లు కుమ్మరిస్తున్నాయి. కుటుంబంలో ఒక్కరికే అవకాశం కల్పించడమేగాక, రేషన్‌కార్డు ఉంటేనే పథకానికి అర్హులని సర్కారు షరతులు విధించింది. గత ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కార్పొరేషన్ల ద్వారా స్వయం ఉపాధి కోసం దరఖాస్తు చేసుకుని.. లబ్ధి పొందని వారికి ఈ సమస్య మెడకు గుదిబండలా మారింది. గతంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కార్పొరేషన్ల ద్వారా స్వయం ఉపాధి అవ కాశాలు పొందని వారు రాజీవ్ యువ వికాసం కింద దరఖాస్తులో ఆధార్ నంబర్‌ను నమోదు చేయగానే 'ఆల్రెడీ అప్లయిడ్' అని చూపుతోంది. వీరే కాకుండా.. వికలాంగులు ఆ శాఖ ద్వారా స్వయం ఉపాధి కోసం ఏడాది క్రితం దరఖాస్తు చేసుకున్నవారి పరిస్థితీ అంతే. అసలు వీరిలో లబ్ధిదారుల ఎంపికే జరగలేదు. కానీ, యువ వికాసం కింద దరఖాస్తు కోసం ప్రయత్నిస్తే అప్లరు చేసినట్టే సైట్‌లో కనిపిస్తోంది. ఈ పరిణామాలతో స్వయం ఉపాధి పొందాలనుకున్న నిరుద్యోగ యువత తీవ్ర నిరాశలో పడింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్లు చాలా కాలం నుంచి నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అందించే ప్రక్రియను నిలిపేశాయి. దీంతో ప్రస్తుతం రాజీవ్ యువ వికాసం పథకం ఒక ఆశాజ్యోతిగా ఉంది. దీనికితోడు ఈ బడ్జెట్‌లో ప్రభుత్వం ఈ పథకానికి రూ.ఆరు వేల కోట్లు కేటాయించడంతో దాదాపు ఐదు లక్షల మందికి స్వయం ఉపాధి కల్పించే అవకాశాలున్నాయి. అదే కనుక సక్రమంగా అమలు జరిగితే యువత నెత్తిన సర్కార్ పాలు పోసినట్టే. ఒకవైపు దరఖాస్తుకు గడువు చూస్తే ముంచుకొస్తుంది. మరోవైపు ఈ ఇబ్బందులు యువతను కలవర పెడుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సత్వరమే రేషన్ కార్డులను జారీ చేసి, దరఖాస్తు చేసుకునే గడువును పొడిగించాలి. కనీసం గతంలో చేసిన దరఖాస్తులనైనా పరిగణనలోకి తీసుకోవాలి. అదే విధంగా గతంలో దరఖాస్తుదారులు నమోదు చేసిన వివరాలను అధికారులు తొలగించకపోవడం వల్లే తలెత్తుతున్న సమస్యలను సైతం పరిష్కరించాల్సిన అవసరం ఏంతైనా ఉంది. దీనిపై ఇప్పటికైనా స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. లేదంటే అంతిమంగా నష్టపోయేది పేదపిల్లలే..ఉద్యోగాల కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురుచూసే అభాగ్యులే.

# హన్మకొండలో టాటూగ్యాంగ్ హల్‌చల్

వరంగల్,వరంగల్‌లో "టాటూ గ్యాంగ్".. భారీ దోపిడీలకు పక్కా ప్లాన్‌తో రంగంలోకి దిగిన ఈ ముఠా టార్గెట్ చేసింది.. విశాలంగా ఉంటే ధనవంతుల ఇళ్లను టార్గెట్ చేసి లూటీలకు బరితెగిస్తోంది.. తాజాగా హనుమకొండ పరిధిలోని ఓ ఇంట్లో భారీదోపిడీకి ప్రయత్నం చేశారు.. అదృష్టవశాత్తు ఆ ఇంట్లో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.. సీసీ కెమెరా ఫుటేజ్ చూసి షేక్ అయిన పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నారు.. హనుమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని విద్యారణ్యపురిలో జరిగిన రాబరీ నగరమంతా ఒక్కసారిగా ఉలిక్కిపడేలా చేసింది..సీసీ కెమెరా ఆధారంగా విచారణ చేపట్టిన పోలీసులు ఒక్కసారిగా షాక్ అయ్యారు.. ఈ దోపిడికి పాల్పడిన ముఠా మామూలు దొంగలు కాదని కరడుగట్టిన అంతర్రాష్ట్ర దొంగల ముఠా అని గుర్తించారు.. మొత్తం ఆరుగురు వ్యక్తులు ముసుగులు ధరించి దోపిడీలకు పాల్పడ్డారు.. వాళ్ళ ఒంటిపై ప్రతి ఒక్కరి ఎడమ చేతిపై పచ్చబొట్టు, చేతిలో మారణాయుధాలు కలిగి ఉండడం చూసి ఇదేదో డిఫరెంట్ డేంజర్ గ్యాంగ్‌గా భావిస్తున్నారు. విద్యారణ్యపురిలో దోపిడీకి పాల్పడిన ఈ ముఠా ఆ ఇంటి కిటికీ గ్రిల్స్ ధ్వంసంచేసి ఇంట్లోకి ప్రవేశించారు.. విలువైన వస్తువులు దొంగిలించారు.. సీసీ కెమెరాల్లో వాళ్ల దోపిడి దృశ్యాలు అంతా రికార్డయ్యాయి. అర్ధరాత్రి దోపిడికి పాల్పడిన ముఠా రెండున్నర గంటలపాటు ఆ ఇంట్లోనే గడిపినట్టుగా సీసీ కెమెరా ఫుటేజ్‌లో లభ్యమైన ఆధారాలను బట్టి పోలీసులు గుర్తించారు.. ఈ ముఠా ఇంట్లోకి ప్రవేశించిన సమయంలో ఆ ఇంట్లోని వారు గాఢ నిద్రలో ఉన్నారు. ఎవరు నిద్రలేచి ప్రతిఘటించకపోవడంతో అంతా ప్రాణాలతో బయటపడ్డారు.. లేకపోతే ఊహించిన విధంగా ప్రాణనష్టం జరిగి ఉండేదని పోలీసులు పేర్కొంటున్నారు. ఈ దోపిడీ ఘటన జరిగి 24 గంటల వ్యవధిలో వాళ్ళు ఇంకా సిటీ దాటి వెళ్ళలేదని పోలీసు నిఘా వర్గాలు, టీమ్స్ గుర్తించాయి.. ఆరు ప్రత్యేక బృందాలతో పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.. ఈ ముఠా వరంగల్ సిటీ పరిసర ప్రాంతాల్లోనే ఎక్కడో తలదాచుకున్నారని.. కచ్చితంగా ఏదో ఒక దారుణానికి పాల్పడతారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఎలాంటి ఘటనలు జరగకుండా ముందుగా అప్రమత్తమైన పోలీసులు.. నగర పరిసరాలన్నీ జల్లెడ పడుతున్నారు.. టాటూ దొంగల గురించి ప్రజలను అప్రమత్తం చేయడం తోపాటు.. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.. ఈ దొంగల గురించి ఏమైనా సమాచారం ఉంటే.. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరుతున్నారు.

# దేశీయంగా రైతుకు సవాల్

న్యూఢిల్లీ, దేశంలో ఆహర ధాన్యాల దిగుమతులపై దృష్టి సారించాలి. అంతేగాకుండా సమీక్షించుకోవాలి. మనదేశంలో అన్నిరకాల ధాన్యం పండుతున్న దిగుమతులు చేసుకోవడం, ఇక్కడి రైతులకు భరోసా లేకుండా చేయడం సరికాదు. అలాగే ప్రజలకు కూడా సరసమైన ధరలకు ఆహారా ధాన్యలు దక్కడం లేదని గుర్తించాలి. రైతులను ప్రోత్సహించడం ద్వారా అన్నిరకాల పంటలు పండించే అవకాశం ఉన్న భూములను ఉపయోగించుకోవాలి. రైతులను ప్రోత్సహిస్తే అన్నిరకాలు పంటలు పండిస్తారు. అందుకు మన భూములు అనుకూలంగా ఉన్నాయి. గతంలో రికార్డు స్థాయిలో 97 మిలియన్ టన్నుల గోధుమ ఉత్పత్తి అయిన నేపథ్యంలో, కేవలం 8 లక్షల టన్నుల గోధుమలను ఉక్రెయిన్, రష్యా నుంచి జీరో డ్యూటీతో దిగుమతి చేయడం ఆర్థికంగా అర్థరహితం. రైతులు గిట్టుబాటు ధర లేక ఉల్లిపాయలను వీధుల్లో పారేసిన ఘటనలు ఇంకా మనం మర్చిపోలేదు. ఇదిలా ఉండగా, గతంలో పండుగల సమయంలో ప్రభుత్వం 3 లక్షల టన్నుల చక్కెరను 25 శాతం డ్యూటీని తగ్గించి మరీ దిగుమతి చేసుకునేందుకు అనుమతించింది. పప్పు ధాన్యాలు దేశంలో విరగపండిన సమయంలో అది జరిగిందని నివేదిక వివరించింది. దీనితో ధరలు పడిపోయి, రైతులు అత్యంత చౌకగా తమ ఫలసాయాన్ని అమ్ముకోవలసి వచ్చింది. ఒక్క శనగ పప్పు మినహా మిగిలిన పప్పు ధాన్యాలు అన్నింటిపై రైతులకు లాభంలో మార్జిన్ 30 శాతం పడిపోయింది. ఇదే తరహా ధరలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. దేశంలో ఈసారి పండిన పెసర, కందిపప్పుకు కొనుగోలుదారులు లభ్యం కావడం లేదు. హోల్ సేల్ ధరలు పెరగకపోవడంతో పరిస్థితి ఆశాజనకంగా లేదు. భారత దేశం ఇప్పటికే లక్షల టన్నుల పప్పు ధాన్యాలను మొజాంబిక్ నుంచి దిగుమతి చేసుకునేందుకు ఒప్పందంపై సంతకాలు చేసింది. రష్యా, బ్రెజిల్, దక్షిణాఫ్రికా నుంచి పప్పు ధాన్యాలు, నూనె

# వేసవి ఎండలతో తాగునీటి సరఫరాపై దృష్టి

అమరావతి, ఎండలు దంచికొడుతున్నాయి.. రికార్డుస్థాయిలో గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి.. దీంతో, సమ్మర్ యాక్షన్ ప్లాన్ పై ఫోకస్ పెట్టింది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం.. మరోవైపు.. మున్సిపాలిటీల్లో సమ్మర్ యాక్షన్ ప్లాన్ పై మంత్రి నారాయణ దృష్టిసారించారు..

తాగు నీటి ఎద్దడి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులతో మంత్రి నారాయణ సమీక్ష సమావేశం నిర్వహించారు..వేసవిని దృష్టిలో పెట్టుకొని తాగునీటి ఎద్దడి లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి నారాయణ సూచించారు.. తాగు నీరు సరఫరాలో ఇబ్బందులు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని ఆదేశాలు జారీ చేశారు.. మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులు, అన్ని మున్సిపాలిటీల కమిషనర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు.. మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్, డైరెక్టర్ సంపత్ కుమార్, ఇంజినీర్ ఇన్ చీఫ్ మరియన్న తదితరులు పాల్గొన్నారు.. వారంలో మూడు సార్లు డ్రింకింగ్ వాటర్ సరఫరాపై సమీక్ష చేస్తానని వెల్లడించారు మంత్రి నారాయణ.. శివారు ప్రాంతాలకు కూడా అవసరమైన మేర డ్రింకింగ్ వాటర్ స్లపై చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.. పారిశుధ్యం పైనా ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.. చెత్త పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు మంత్రి నారాయణ..

# యువకుడిని నరకిచంపిన యువతి తండ్రి

పెద్దపల్లి,పుట్టిన రోజే ఓ యువకుడిని యువతి తండ్రి గొడ్డలిలో అత్యంత దారుణంగా హత్య చేసిన సంఘటన జిల్లాలో కలకలం సృష్టించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...ఎలిగేడు మండలం ముప్పిరితోట గ్రామానికి చెందిన పూరేళ్ల సాయికుమార్ గౌడ్ (17) వేరే సామాజిక వర్గానికి చెందిన యువతి ప్రేమిస్తున్నాడు. ఈ క్రమంలో సాయి తన పుట్టినరోజు వేడుకలు చేసుకుంటుండగా అక్కడకు వచ్చిన యువతి తండ్రి సాయిపై గొడ్డలితో వేటు వేశాడు. మొదట సాయి మెడపై అమ్మాయి తండ్రి వేటు వేయగా.. తీవ్రంగా గాయపడిన యువకుడు అక్కడిని నుంచి ప్రాణాలను కాపాడుకునేందుకు పరిగెత్తాడు. అయినప్పటికీ అతడిని వదలలేదు. సాయి కుమార్‌ను కాపాడటానికి స్నేహితులు కూడా వెనకే పరిగెత్తారు. కానీ బొడ్రాయి దగ్గర మళ్లీ వరుసగా సాయిపై గొడ్డలి పోట్లు పడ్డాయి. దీంతో యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. సాయిని నరికిన వెంటనే నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు.

# కాంగ్రెస్‌లో ఆ ఎమ్మెల్యేల పరిస్థితి ఏంటి?




హైదరాబాద్,ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో మంత్రి పదవి దోబూచులాడుతోంది. రాష్ట్రంలో మంత్రివర్గ విస్తరణ జరగనుందని మళ్లీ మొదలైన ప్రచారంతో.. పదవి ఎవరికి దక్కనుందోనని కాంగ్రెస్ వర్గాలు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నాయి. జిల్లా నుంచి మంత్రివర్గంలో ప్రాతినిధ్యం లేకపోవడంతో ఈ సారి తప్పకుండా అవకాశం వస్తుందని.. ఆ లక్కీ లీడర్ ఎవరా అని అధికారపక్షం శ్రేణులు చర్చించుకుంటున్నాయి. జిల్లా కాంగ్రెస్ నేతలు ఏ ఇద్దరు కలిసినా ప్రస్తుతం అదే చర్చంట.

**ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కాంగ్రెస్‌కు నలుగురు ఎమ్మెల్యేలు**

ఉమ్మడి అదిలాబాద్ జిల్లాలోని పది శాసనసభ స్థానాల్లో ఖానాపూర్, మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూరుల్లో కాంగ్రెస్ విజయకేతనం ఎగురవేసింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పుడు తొలిసారి మంత్రివర్గం ఏర్పడినప్పుడు జిల్లా ఎమ్మెల్యేలకు అవకాశం దక్కలేదు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత మంత్రి వర్గ విస్తరణ జరుగుతుందని ప్రచారం జరగడంతో గెలిచిన ఎమ్మెల్యేలు ఎవరి ప్రయత్నాలు వారు చేసుకున్నారు. అయితే అప్పుడు కూడా విస్తరణ జరగకపోవడంతో వారికి నిరాశే మిగిలింది.

**మంత్రివర్గంలో ప్రాతినిధ్యం లేని ఆదిలాబాద్ జిల్లా**

తాజాగా సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలు ఢిల్లీకి వెళ్లి అధిష్టానంతో చర్చలు జరిపి రావడంతో .. తిరిగి మంత్రివర్గ విస్తరణపై జిల్లా ఆశావహుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్‌లో చెన్నూరు ఎమ్మెల్యే, మాజా ఎంపీ గడ్డం వివేక్, మంచిర్యాల శాసనసభ్యుడు కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావులు సీనియర్ నేతలుగా కేబినెట్ బెర్త్ కోసం నువ్వా-నేనా అన్నట్లు పోటీ పడుతున్నారు.

**వెంకటస్వామి తనయులుగా వివేక్, వినోద్ లకు గుర్తింపు**

దివంగత నేత కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి తనయులుగా బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డంవినోద్, వివేక్‌లకు అధిష్టానం దగ్గర మంచి గుర్తింపు ఉంది. ఏఐసీసీ అధ్యక్షుడు ఖార్గేతో వారికి సాన్నిహిత్యం ఉన్నప్పటికీ వివేక్ బీజేపీ, బీఆర్ఎస్‌లలోకి వెళ్లి రావడం వారికి ఒకింత మైనస్ అంటున్నారు. ఆ క్రమంలో పార్టీ మారకపోవడం తనకు కలిసి వస్తుందని ప్రేమ్‌సాగర్‌రావు భావిస్తున్నారట. పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్ రెడ్డి ఇంద్రవెల్లి వేదికగా నిర్వహించిన ఆదివాసీ, దళిత, గిరిజన సభ విజయవంతం, సీఎల్పీ నేతగా భట్టి విక్రమార్క చేపట్టిన పాదయాత్రను సక్సెస్ చేయడం, ఖర్గే మంచిర్యాల సభల బాధ్యతలు సమర్ధంగా నిర్వహించడం తమకు ప్లస్ అవుతుందని ప్రేమ్‌సాగర్‌రావు వర్గం ధీమాగా ఉంది.

**ఎన్నికల ముందు బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన వివేక్**

వివేక్ శాసనసభ ఎన్నికల ముందు బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. అప్పుడే ఆయన తనకు మంత్రిపదవి ఇవ్వాలనే షరతు పెట్టిన విషయాన్ని గుర్తుచేస్తున్నారట. రాష్ట్రవ్యాప్త పరిణామాలను పరిశీలిస్తే దళిత వర్గానికి చెందిన వివేక్ కు అవకాశాలున్నట్టు స్పష్టమవుతోందంటున్నారు. వివేక్, వినోద్ సోదరులు , ప్రేమ్‌సాగర్‌రావు వర్గాల మధ్య సఖ్యత చెడకుండా రాష్ట్ర నాయకత్వం వేచి చూసే ధోరణిని అవలంబిస్తూ వస్తున్నట్లు తెలుస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో మంత్రివర్గ విస్తరణ చేస్తే మంత్రి పదవి ఎవరికి ఇస్తారనేది కీలకం కానుంది.

**ఆదివాసి కోటాలో వెడమ బొజ్జు పేరు పరిశీలుస్తారా?**

మరోవైపు అవకాశం ఉంటే బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడమ బొజ్జు పేర్లను పరిశీలించాలన్న ప్రతిపాదనలు అధిష్టానానికి వెళ్లినట్టు తెలుస్తోంది. విశ్వాసంతో కష్టకాలంతో పార్టీతో ఉన్న తనకు మంత్రి పదవి ఇవ్వాలని వినోద్ ఢిల్లీ స్థాయిలో పావులు కదుపుతున్నారంట. మరో వైపు ఆదివాసీ కోటాలో భాగంగా వెడమ బొజ్జు పేరు పరిశీలించి, పదవి కట్టబెడితే అందరికీ సమ న్యాయం చేసినట్లవుతుందని ఆయన అనుయాయులు పేర్కొంటున్నారు. మొత్తానికి ఈసారైనా విస్తరణలో ఉమ్మడి అదిలాబాద్ జిల్లాకు ప్రాతినిధ్యం దక్కుతుందా? మంత్రి పదవి ఎవరిని వరిస్తుందనేది జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

# భావస్వేచ్ఛను గౌరవించాలి..అది ప్రాథమిక హక్కు కిందకే వస్తుంది

న్యూఢిల్లీ,కవిత్వం, నాటకం, స్టేజీ ప్రదర్శనలు, వ్యంగ్యం మరియు కళల ద్వారా భావాన్ని స్వేచ్ఛగా వ్యక్తీకరించే ప్రాథమిక హక్కుని గౌరవించాలని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. 'ఏ ఖూన్ కే ప్యాసె బాత్ సునో ' అనే కవితను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసినందుకు కాంగ్రెస్ ఎంపి ఇమ్రాన్ ప్రతాప్‌గర్హిపై గుజరాత్ పోలీసులు నమోదు చేసిన కేసును శుక్రవారం కొట్టివేసింది. వాక్‌స్వేచ్ఛ మరియు భావ ప్రకటనా స్వేచ్ఛను కాపాడటానికి కోర్టులు ముందంజలో ఉండాలని పేర్కొంది.ఉదారవాద, రాజ్యాంగబద్ధమైన ప్రజాస్వామ్యంలో అత్యంత విలువైన హక్కులైన వాక్ స్వాతంత్ర్యం, భావప్రకటనా స్వేచ్ఛ, ప్రతి విమర్శ లేదా అసమ్మతిని తమ అధికారం మరియు స్థానానికి ముప్పుగా భావించే అభద్రతా భావంతో బలహీనం చేయకూడదని జస్టిస్ ఎస్.ఓకా, జస్టిస్ ఉజ్వల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. వాక్ స్వాతంత్ర్యంపై సహేతుకమైన ఆంక్షలు సహేతుకంగానే ఉండాలని జస్టిస్ భుయాన్ వివరించారు. ఆంక్షలు హానికరం లేదా అణచివేతగా ఉండకూడదని, స్వేచ్ఛగా మాట్లాడే ప్రాథమిక హక్కుని ఆంక్షలు కప్పివేయలేవని జస్టిస్ భుయాన్ సూటిగా పేర్కొన్నారు. ఒక వ్యక్తి వాక్, భావ ప్రకటనా హక్కుని కాపాడటం , గౌరవించడం పోలీసుల, ప్రభుత్వాల భాధ్యత అని ధర్మాసనం ఉద్ఘాటించింది. కవిత్వం, నాటకం, సినిమాలు, రంగస్థల ప్రదర్శనలు, వ్యంగ్యం, కళలు సహా సాహిత్యం జీవితాన్ని మరింత అర్థవంతం చేస్తుందని, వ్యక్తులు తమ అభిప్రాయాలను, ఆలోచనలను వ్యక్తీకరించే హక్కులను గౌరవించాలని జస్టిస్ ఓకా పునరుద్ఘాటించారు. ఆరోగ్యకరమైన ,నాగరిక సమాజంలో వాక్ స్వాతంత్ర్యం అంతర్భాగమని, మెజారిటీ- వ్యక్తులు అభిమానిస్తున్నారనే కారణంతో ఒక వ్యక్తి అభిప్రాయాలను అణచివేయలేమని కోర్టు వ్యాఖ్యానించింది. పోలీసులు



కూడా భిన్నాభిప్రాయాలను కాపాడాలని, అవి కూడా ప్రజాస్వామ్య విధుల్లో ఒక భాగమని కోర్టు పేర్కొంది. ఆలోచనా స్వేచ్ఛ లేకుండా భావప్రకటన లేకుండా రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 హామీ ఇచ్చిన గౌరవప్రదమైన జీవితాన్ని గడపడం అసాధ్యం అని జస్టిస్ ఓకా పేర్కొన్నారు. పోలీసులు మరియు ప్రభుత్వం వాక్ స్వాతంత్యాన్ని కాపాడటంలో విఫలమైతే కోర్టులు తప్పకుండా జోక్యం చేసుకోవాలని, పౌరుల ప్రాథమిక హక్కులను కాలరాయకుండా చూసుకోవడం కోర్టుల విధి అని పేర్కొన్నారు.కులం మతం ఆధారంగా వివిధ వర్గాల ప్రజల మధ్య శతృత్వాన్ని పెంచుతున్నారని ఆరోపిస్తూ గుజరాత్ పోలీసులు ప్రతాప్‌గర్హిపై కేసు నమోదు చేశారు. మార్చి 3 విచారణ సమయంలో ఈ కవిత అహింసను సూచిస్తుందని మహాత్మాగాంధీ స్వయంగా అనుసరించిన మార్గమని మార్చి 3న జరిగిన విచారణలో జస్టిస్ ఓకా పేర్కొన్న సంగతి తెలిసిందే.

# మళ్లీ పెరగనున్న మెట్రో చార్జీలు



హైదరాబాద్, మెట్రోకు ఈ మధ్యకాలంలో నష్టాలు వస్తుండటంతో హైదరాబాద్ మెట్రో రైలు టికెట్ రేట్లు పెంచాలని, రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కేంద్రం అనుమతి కోరేందుకు ఎల్అండ్‌టీ, హైదరాబాద్ మెట్రో రైల్ (హెచ్ఎంఆర్) సంస్థ అధికారులు ప్రయత్నిస్తున్నారు. రోజుకు కోటిన్నర రూపాయల నష్టం వస్తోందని, ప్రాజెక్టు నిర్మాణ సమయంలో అంతర్జాతీయ బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలకు ఇప్పటికీ వడ్డీలు చెల్లించలేకపోతున్నామని ఎల్అండ్‌టీ సంస్థ చెబుతోంది. అయితే ప్రయాణికులపై అదనపు భారం వేయొద్దనే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం ధరల పెంపునకు సుముఖంగా లేదని తెలుస్తోంది. నగరంలో మొదటిదశ ప్రాజెక్టును ఎల్అండ్‌టీ సంస్థ నిర్మించిన విషయం తెలిసిందే. ప్రైవేటు, ప్రభుత్వ భాగస్వామ్యం (పీపీపీ)లో 2012లో రూ.14,132 కోట్ల వ్యయంతో పనులు ప్రారంభించి 2017 నవంబరులో పూర్తిచేశారు. మూడు కారిడార్ల పరిధిలో ప్రయాణించే వారి సంఖ్య రోజూ 5.10 లక్షలకు చేరింది. కరోనాకు ముందు రోజుకు రూ.80 లక్షలకు పైగా ఎల్ అండ్ టీ ఆదాయం సమకూర్చుకుంది. అయితే, 2020లో కరోనా లాక్‌డౌన్‌తో మెట్రో కుదేలైంది. 2022 నుంచి క్రమంగా కోలుకున్నా నష్టాల ఊబి నుంచి బయటపడలేదని చెబుతోంది. మెట్రో నిర్వహణలో రోజుకు సుమారు రూ.కోటిన్నర వరకు నష్టం వస్తున్నట్లు ఎల్ అండ్ టీ అధికారులు తరచూ చెబుతున్నారు. ఆశించినవిధంగా ప్రయాణికుల సంఖ్య రోజుకు 6 లక్షలకు పెరగకపోవడం, నిర్వహణ ఖర్చులు పెరిగిపోవడంతో నష్టాలు ఎదురవుతున్నాయని పేర్కొంటున్నారు. టికెట్ రేట్ల సవరణ విషయంపై హెచ్ఎంఆర్ సంస్థ, అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం విజ్ఞప్తి మేరకు కేంద్ర ప్రభుత్వం 2022 సెప్టెంబరులో కమిటీని నియమించింది. ఆ కమిటీ ప్రజాభిప్రాయాన్ని సేకరించి నివేదిక సమర్పించింది. అదే సమయంలో 2023 జనవరి నుంచి రాష్ట్రంలో ఎన్నికల వాతావరణం రావడంతో టికెట్ చార్జీల విషయం మరుగునపడింది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా కేంద్రం అనుమతి కోరేందుకు హెచ్ఎంఆర్, ఎల్అండ్‌టీ అధికారులు ప్రయత్నిస్తున్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా మెట్రోకు మహిళా ప్రయాణికుల సంఖ్య బాగా తగ్గిందని, కనీసం టికెట్ చార్జీలు పెంచుకునే అవకాశం కల్పిస్తే కొంతైనా నష్టాలను పూడ్చుకుంటామని ఎల్అండ్‌టీ కోరుతోంది. అయితే మెట్రో రెండో దశ నిర్మాణంపై దృష్టి సారించిన సర్కారు ఇప్పుడు కేంద్రానికి ఈ విషయం తెలియజేస్తే... అసలు లక్ష్యం దెబ్బతినే అవకాశం ఉందని భావిస్తోంది. అంతేకాకుండా కాలుష్యరహితంగా నడిచే మెట్రో రైళ్లలో టికెట్ ధరలు అందుబాటులో ఉండాలని, పెంచితే ప్రయాణికుల సంఖ్య పడిపోతుందన్న విషయాన్ని పరిగణనలోకి తీసుకుంటోంది.

# 'మాతో పెట్టుకోవద్దు జాగ్రత్త'.. మోదీకి హీరో స్ట్రాంగ్ వార్నింగ్..?

చెన్నై: తమిళ స్టార్ హీరో విజయ్ దళపతి గురించి ప్రత్యేకంగా పరిచయాలు అవసరం లేదు. ఈరోజు సినిమాలు తెలుగులో కూడా హిట్ అవ్వడంతో ఇక్కడ కూడా మంచి మార్కెట్ ఉంది. చాలామంది హీరోలు ఒక వైపు సినిమాలు చేస్తూనే.. మరోవైపు రాజకీయాల్లోకి వచ్చి ప్రజలకు సేవ చేయాలనే ఆలోచనతో ఉంటారు. ఇప్పటికే కొందరు స్టార్ హీరోలు హీరోయిన్లు రాజకీయాల్లో తమ సత్తాను చాటుతూ దూసుకుపోతున్నారు. ఇక విజయ్ దళపతి ఇటీవలే కొత్త పార్టీని స్థాపించి రాజకీయాల్లో చురుగ్గా ఉంటున్నాడు. ఆయన స్థాపించిన తమిళగ వెట్రి కజగమ్ పా ర్టీ తొలి సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడిన మాటలు సంచలనం గా మారాయి.. ముఖ్యంగా మోడీ గురించి ఆయన మాట్లాడిన మాటలు ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగవారిలో ఉన్నాయి.

**మోదీని టార్గెట్ చేసిన హీరో..**

విజయ్ స్థాపించిన కొత్త పార్టీలో ఒక సమావేశన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హీరో విజయ్ మాట్లాడుతూ డైరెక్ట్ గా మోదిని టార్గెట్ చేశాడు. ఆయన మాట్లాడుతూ.. %ణవీఖ%, బీజేపీ పార్టీలు రహస్య మిత్రులని, పేరుకి మాత్రమే కాంగ్రెస్ కూటమిలో కూటమిలో ఉందని వ్యాఖ్యానించాడు. ఈ సందర్భంగా ఆయన దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన డీలిమిటేషన్ అంశం పై, అదే విధంగా త్రిభాషా విధానం తో హిందీ భాషను బలవంతంగా రుద్దాలని చేసే ప్రయత్నం పై విజయ్ మోడీపై విమర్శలు గుప్పించారు. జీఎస్టి, మహిళలపై జరుగుతున్న అన్యాయాలపై, జమిలీ ఎన్నికల ప్రక్రియ విజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు.. విజయ్ మాట్లాడుతూ ఇలాంటివన్నీ అన్యాయం చేయాలని చూస్తున్నారు.. తప్పకుండా ఏదో ఒక రోజు నిజ స్వరూపం బయట పడుతుంది అంటూ విజయ్ అన్నారు. తమిళనాడు జోలికొస్తే మర్యాదగా ఉండదు అంటూ మోడీకి విజయ్ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చాడు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.



డీఎంకే vs టీవికె పార్టీల మధ్య పోటీ..

తమిళనాడు రాజకీయాలు రోజురోజుకీ వేడి ఎక్కుతున్నాయి. కొత్త పార్టీలు పాత పార్టీల మధ్య పెద్ద చర్చ నడుస్తుంది. ముఖ్యమంత్రి స్టాలిన్ పై విజయ్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. బీజేపీ పాట పాడుతుంటే ,DMK ఆ పాటకు డ్యాన్స్ వేస్తుంది అంటూ ఆయన విరుచుకుపడ్డారు.. ముఖ్యమంత్రి స్టాలిన్ ఎంతగా విమర్శలు చేస్తున్న కూడా అటుపక్క నుంచి ఎటువంటి సమాధానం లేకుండా సైలెంట్ గా ఉన్నారని తెలుస్తుంది. విజయ్ దళపతి రా జకీయాల్లో చురుగ్గా ఉంటున్నాడు. చూస్తుంటే ఈ రెండు పార్టీల మధ్య గట్టి పోటీ ఏర్పడేలా కనిపిస్తుంది. విజయ్ వ్యాఖ్యలపై అధికార ప్రభుత్వం అస్సలు పట్టించుకోవట్లేదు అని తెలుస్తుంది. అయితే వచ్చే ఎన్నికల్లో విజయ్ ఒంటరిగానే పోటీ చేసే అవకాశాలు కూడా కనిపిస్తున్నాయి. అసలే కొత్త పార్టీ రాజకీయాల్లో అంత అనుభవం కూడా లేదు. ఇప్పుడు విజయ్ ఇలాంటి నిర్ణయం తీసుకోవడంపై ఆయన అభిమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక విజయ్ సినిమాల విషయానికొస్తే ప్రస్తుతం తన చివరి సినిమా చేస్తున్నారు.. ఆ సినిమాను పూర్తి చేసి రాజకీయాల్లో పూర్తిగా బిజీ అవ్వాలని విజయ్ భావిస్తున్నారు..

# సీఎంగా తమిళ ప్రజలు ఎవరిని కోరుకుంటున్నారు..?

చెన్నై:వచ్చే ఏడాది తమిళనాడులో ఎన్నికలు జరగబోతున్నాయి. ఈ నేపథ్యంలో అక్కడ రాజకీయ వాతావరణం ఇప్పటికే వేడెక్కింది. అధికార డీఎంకేతో పాటు తమిళ స్టార్ విజయ్ పార్టీ టీవీకే, బీజేపీ, అన్నాడీఎంకేలు తమ తమ ప్రచార వ్యూహాలకు పదును పెట్టాయి.ఇదిలా ఉంటే, తమిళ ప్రజలు ఎవరిని సీఎంగా ఇష్టపడుతున్నారనే దానిపై సర్వే జరిగింది. సీఓటర్ సర్వే తమిళ ప్రజల మనోభావాలను ప్రతిబింబించింది.ఇప్పటికీ, డీఎంకే అధినేత స్టాలిన్ వైపు ఎక్కువ మంది ప్రజలు ఉన్నట్లు తెలుస్తోంది. సర్వేలో పాల్గొన్నవారిలో 27 శాతం మంది ఆయనకు అనుకూలంగా ఓటేశారు. 18 శాతం మంది తమిళగ వెట్రి కజగం అధినేత విజయ్‌ని సీఎంగా చూడాలనుకుంటున్నారు. ఇప్పటి వరకు ఎన్నికల్లో పోటీ చేయకపోయినప్పటికీ, విజయ్ అప్రూవల్ రేటింగ్‌లో స్టాలిన్‌కి పోటీ ఇస్తున్నారు. సీఎం ఛాయిస్‌లో స్టాలిన్ మొదటి స్థానంలో ఉండగా, విజయ్ రెండో స్థానంలో ఉన్నారు. మరోవైపు, ప్రతిపక్ష అన్నాడీఎంకే కార్యదర్శ ఎడప్పాడి పళని స్వామికి 10 శాతం మంది మద్దతుతో మూడోస్థానంలో, బీజేపీ తమిళనాడు చీఫ్ అన్నామలై 9 శాతంతో సీఎం ఎంపికగా ఉన్నారు.తమిళ ప్రభుత్వ పనితీరుపై 15 శాతం మంది "చాలా సంతృప్తి వ్యక్తం చేశారు", 36 శాతం మంది "కొంత వరకు సంతృప్తి చెందారు", 25 శాతం మంది "అసంతృప్తి" వ్యక్తం చేశారు. 24 శాతం మంది ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదని చెప్పారు. ఎంకే స్టాలిన్ వ్యక్తిగత పనితీరుపై 22 శాతం మంది ప్రతివాదులు "చాలా సంతృప్తి" వ్యక్తం చేయగా, 33 శాతం మంది పర్వాలేదని, 22 శాతం మంది అస్సలు బాగోలేదని




చెప్పారు. 23 శాతం మంది ఇంకా నిర్ణయం తీసుకోలేదని వెల్లడించారు. ఆయన పాలనపై ప్రజల్లో మిశ్రమ స్పందన వ్యక్తమైంది.ప్రతిపక్ష నాయకుడు పళని స్వామి పనితీరుపై సర్వేలో పాల్గొన్న వారిలో 8 శాతం మంది మాత్రమే సంతృప్తి వ్యక్తం చేయగా, 27 శాతం కొంత వరకు సంతృప్తి వ్యక్తం చేశారు. 32 శాతం మంది అసంతృప్తి వ్యక్తం చేశారు. 33 శాతం మంది ఇంకా నిర్ణయం తీసుకోలేదని చెప్పారు. ఓట్లను ప్రభావితం చేసే అంశాల్లో 15 శాతం మంది "మహిళా భద్రత"ను హైలెట్ చేశారు. 12 శాతం మంది ధరల పెరుగుదల, 10 శాతం మంది మాదకద్రవ్యాలు, మద్యం దుర్వినియోగం వంటి కీలక సమస్యగా చెప్పారు. నిరుద్యోగమని 8 శాతం మంది చెప్పారు.

# ఎమ్మెల్యే సుజనా : అంతా గత వైభవమేనా ?



విజయవాడ:ఆయన టీడీపీలో ఉన్నపుడు ఎంతో కీలకంగా ఉండేవారు. పార్టీకి వెన్నుదన్నుగా ఉండేవారు. ఆయన హవా గురించి మీడియాలో రకరకాలుగా చెప్పుకునేవారు. 2014 నుంచి 2019 మధ్యలో ఎన్డీయే ప్రభుత్వంలో సుజనా చౌదరి కీలకమైన మంత్రిత్వ శాఖలకు సహాయ మంత్రిగా పనిచేశారు. కేబినెట్ మంత్రిగా ఉన్న అశోక్ గజపతిరాజు కంటే కూడా తన ఆయన ఢిల్లీలో పార్టీ తరఫున చురుకుగా ఉండేవారు అని చెబుతారు. అలాగే ప్రాధాన్యత అందుకునేవారు అని అంటారు.ఇక ఆయన 2019లో ఏపీలో టీడీపీ ఓటమి పాలు కావడంతో బీజేపీలోనికి వెళ్ళారు. 2022 దాకా ఆయన రాజ్యసభ సభ్యత్వం ఉండేది. దాంతో బీజేపీ హైకమాండ్ వద్ద కూడా ఆయన పలుకుబడి వేరే లెవెల్ అన్నట్లుగా కథ సాగింది. ఆయనను ఒక దశలో కేంద్ర మంత్రిగా చేస్తారు అని ప్రచారం సాగింది. అంతే కాదు ఆయనను ఏపీ బీజేపీ ప్రెసిడెంట్ గా నియమిస్తారు అని వార్తలు వచ్చాయి.అయితే 2022లో రాజ్యసభ నుంచి రిటైర్ అయినా 2024 లో జరిగిన సార్వత్రిక ఎన్నికల దాకా ఆయనకు ఏ పదవీ దక్కలేదు. బీజేపీ కోటాలో మరోసారి రాజ్యసభకు వెళ్ళాలని సుజనా చౌదరి అనుకున్నా అది అసలు జరగలేదు. ఇక 2024 ఎన్నికల్లో కూడా ఆయన విశాఖ కానీ విజయవాడ కానీ ఎంపీ సీటు కోసం ప్రయత్నం చేశారు అని అంటారు. కానీ అవేమీ దక్కలేదు.ఆఖరులో ఆయనకు విజయవాడ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే సీటు దక్కింది. ముస్లిం మైనారిటీల ప్రాబల్యం అధికంగా ఉన్న చోట నుంచి ఆయన కూటమి ప్రభంజనంలో గెలిచి సత్తా చాటారు. నిజంగా ప్రత్యక్ష ఎన్నికల్లో నిలబడి టఫ్ సీటు నుంచి గెలవడం అంటే మాటలు కాదు, కానీ సుజనా చౌదరి తానే ంటో అలా నిరూపించుకున్నారు.ఇక ఏపీలో కూటమి అధికారంలోకి వచ్చింది. తనకు తప్పనిసరిగా మంత్రి పదవి వస్తుందని ఆశిం చారు. కానీ బీజేపీకి ఇచ్చిన ఒకే ఒక్క మంత్రి పదవి కాస్తా సత్య కుమార్ యా దవ్ కి వెళ్ళింది. అలా బీజేపీ హైకమాండ్ కీలక నిర్ణయం తీసుకుంది. ఇపుడు చూస్తే ఏపీ బీజేపీ ప్రెసిడెంట్ పోస్టు ఒకటి ఖాళీ అవుతోంది.ఆ పదవి ఇచ్చినా సుజనా చౌదరి లాంటి వారికి ఎంతో గౌరవంతో పాటు హుందాతనంగా ఉంటుందని అంటున్నారు. అయితే పురంధేశ్వరి ఖాళీ చేసే ఈ పోస్టుని బీసీ సా మాజిక వర్గానికి ఇస్తారు అని అంటున్నారు ఎందుకంటే వెంటనే అదే సామాజిక వర్గానికి ఎంపిక చేయరు అని అంటున్నారు.దాంతో సుజనా ఆశలు ఇక్కడ కూడా నెరవేరే అవకాశాలు లేవు అని అంటున్నారు.దాంతో ఆయన జస్ట్ ఎ మ్మెల్యేగానే మిగిలిపోయారు అని అంటున్నారు. విజయవాడలో ఉన్న రాజకీయ సామాజిక పరిస్థితుల నేపథ్యంలో ఫ్యూచర్ లో కూడా మంత్రి పదవి ఆయనకు దక్కుతుందా అంటే ఏమో అన్న మాట వినిపిస్తోందిట. రెండు దఫాలు పన్నెండేళ్ళ పాటు రాజ్యసభ సభ్యుడిగా ఉంటూ ఢిల్లీ రాజకీయాల్లో చక్రం తిప్పిన సుజనా చౌదరి ప్రస్తుతానికి ఒక సాధారణ ఎమ్మెల్యేగా మిగిలిపోయారు అని అంటున్నా రు.ఆయన ఎమ్మెల్యేగా పోటీ చేసి రాంగ్ డెసిషన్ తీసుకున్నారా అన్నది కూడా ఆయన సన్నిహితులలో ఉందిట. ఏది ఏమైనా రానున్న నాలుగేళ్ళ కాలంలో ఏదైనా అద్భుతం జరిగి ఆయనకు మంచి హోదా వస్తే ఓకే కానీ లేకపోతే అ ంతా గత వైభవంగా మిగిలిపోతుందేమో అన్న ఆందోళన కూడా వారిలో ఉందిట.

# కమెడియన్ కమ్రాకు ఊరట..




చెన్నై, స్టాండప్ కమెడియన్ కునాల్ కమ్రాకు మద్రాస్ హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. అంతర్‌రాష్ట్ర ముందస్తు బెయిల్ కోరుతూ కమ్రా మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. జస్టిస్ సుందర్ మోహన్ ధర్మాసనం ఎదుట అత్యవసర విచారణ కోరుతూ కమ్రా తరపున న్యాయవాది వి. సురేష్ ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. గురువారం రాత్రి ఈ-ఫైలింగ్ ద్వారా ఈ పిటిషన్ దాఖలు చేయబడింది. నేడు విచారణ చేపట్టిన కోర్టు ఏప్రిల్ 7 వరకు మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసు రాజకీయ ప్రేరేపితమని, భావ ప్రకటనా స్వేచ్ఛను అడ్డుకునే యత్నమని పేర్కొన్నారు. తాను నిర్దోషినని, ఒక కళాకారుడిని వేధించడం, అడ్డుకోవడం లక్ష్యంగా పనికిరాని ఫిర్యాదుతో కేసులో ఇరికించారని కమ్రా పిటిషన్‌లో పేర్కొన్నారు. తన భద్రత, రానున్న ప్రభుత్వ సెలవుల ఆందోళనల దృష్ట్యా అంతర్‌రాష్ట్ర ముందస్తు బెయిల్ కోరుతున్నట్లు తెలిపారు. ముంబయిలో పుట్టిపెరిగినప్పటికీ భద్రత కోసం 2021లో తన నివాసాన్ని తమిళనాడు విల్లుపురానికి మార్చుకున్నట్లు- తెలిపారు. 'నయాభారత్ ' అనే తన తాజా షోలో ఎవరినీ ముఖ్యంగా మహారాష్ట్ర డిప్యూటీ సిఎం ఏక్‌నాథ్ షిండే పేరును పేర్కొనలేదని కోర్టుకు తెలిపారు. ఇప్పటికీ తనకు బెదిరింపులు వస్తున్నాయని అన్నారు.అంధేరీ తూర్పు ఎమ్మెల్యే ముర్జీ కాజీ పటేల్ దాఖలు చేసిన ఫిర్యాదు మేరకు ముంబయిలోని ఖార్ పోలీస్ స్టేషన్‌లో తనపై కేసు నమోదైందని పేర్కొన్నారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com